ప్రజాశక్తి
మంగళవారం 27 ఆగస్టు 2024   8 పేజీలు





ప్రకాశం   బాపట్ల

ఇంటికి ఒకరిద్దరు..

- జనాన్ని పీడిస్తోన్న విషజ్వరాలు..జలుబు
- రోగులతో కిటకిటలాడుతున్న ఆసుపత్రులు
- ఆర్థిక ఇబ్బందులతో పేదల ఇక్కట్లు



యర్రగొండపాలెం వైద్యశాలలో చికిత్స పొందుతున్న జ్వరపీడితులు

ప్రజాశక్తి-ఒంగోలుబ్యూరో

వాతావరణంలో మార్పులు..తాగునీటి జలాలు కలుషితం.. వెరసి ప్రజల ఆరోగ్యాలపై తీవ్ర ప్రభావం చూపుతున్నాయి. సీజనల్ వ్యాధులు విజృంభిస్తున్నాయి. ఇపుడు నెలరోజులుగా జిల్లా అంతటా విషజ్వరాలు,డెంగీ, వైరల్‌తో సంబంధమున్న వ్యాధులు సోకుతున్నాయి. జ్వరమో లేక జలుబు, గొంతుసంబంధ సమస్యలతో ఇంటికి ఒకరిద్దరు మంచాన పడుతున్నారు. ఏది వచ్చినా వారం రోజులు వీడటం లేదు. ఆసుపత్రులు కిటకిటలాడుతున్నాయి. జ్వరాలు తీవ్రంగా ఉన్నాయి. డెంగీ కేసులు పెరిగిపోతున్నాయి. ఇవి ఎక్కువగా ప్రైవేటు ఆసుపత్రులలోనే కనిపిస్తున్నాయి. జనరల్ వైద్యులున్న ఆసుపత్రుల్లో పదుల సంఖ్యలోనే డెంగీ కేసులు తేలుతున్నాయి. జలుబు వస్తే గొంతు సమస్య తీవ్రంగా ఉంటుంది. దగ్గు, గొంతులో నస అనే సమస్య ఎక్కువ మందిలో వినిపిస్తోంది. గొంతు సమస్యతో మాటలో శబ్దం తీరు కూడా చాలా మందిలో మారిపోతోంది. వైద్యం కోసం భారీగానే ఖర్చువుతుంది. సాధారణ ఆసుపత్రులైతే వేలల్లోనే ఖర్చువుతోంది. అదే పెద్దపెద్ద ఆసుపత్రులు పోతే లక్షలు పోయాల్సి వస్తోంది. పరీక్షలు, మందులకు తడిచి మోపెడవుతోంది. ప్రభుత్వ ఆసుపత్రుల్లో డాక్టర్లు, మందుల కొరత వల్ల వైద్యం అందడంలేదు. కేవలం పరీక్షలు చేసి పంపుతున్నారు. రిమ్స్‌లోనే అత్యవసర వైద్యం ఎండమావిగానే మారింది. ఒకపూట ఉంచి ప్రైవేటు ఆసుపత్రులకో, పేదలైతే గుంటూరు జనరల్ ఆసుపత్రికో పంపుతున్నారు. సీరియస్ సమస్యతో రిమ్స్‌కు చేరితే మళ్లీ ఏదోచోటకు తరలిం చాల్సిందే. వైద్యులు,సిబ్బంది పెద్దసంఖ్యలో ఉన్నా అక్కడ మాత్రం పేదలకు వైద్యం ఎండమావిగానే మారింది. ఆపరేషన్లు కూడా సక్రమంగా చేయడం లేదు. నియోజకవర్గకేంద్రాలు, తాలూకా కేంద్రాల్లో ఉన్న ఆసుపత్రుల్లోనూ ఇదే పరిస్థితి. ఏదో మొక్కుబడిగానే వైద్యం చేస్తున్నారు. చిన్నపాటి రోగాలకు మందులు ఇచ్చి పంపుతున్నారు. డెంగీగా నిర్ధారణ అయితే మాత్రం ప్రైవేటు ఆసుపత్రులకు పోవాల్సిందే. లేకుంటే ప్రాణాలపై ఆశలు వదులుకోవాల్సిందే. సామాన్యులు పట్టణాల్లో ప్రైవేటు ఆసుపత్రులకు రాలేక గ్రామాల్లోనే ఆర్‌ఎంపిలకు వద్దకు పోతున్నారు. అక్కడ తగ్గితే అదృష్ట వంతులు.లేకుంటే మళ్లీ నాలుగు రోజుల తర్వాత పట్టణాల్లోని ప్రైవేటు ఆసుపత్రులకు రావాల్సిందే. ఇపుడు ఒంగోలులోని అన్ని జనరల్ ఆసుపత్రులు, పెద్దపెద్ద ఆసుపత్రులన్నీ రోగులతో కిటకిట లాడుతున్నాయి. వ్యాధులకు తాగునీటితో పాటు గాలిలో వైరస్‌లు కారణాలుగా కనిపిస్తున్నాయి. ఈ సమస్యలపై దృష్టి సారించాలి. వర్షాలకు కొత్తనీరు వచ్చిచేరింది.చెరువులు, ఎస్ఎస్ ట్యాంకుల్లో ఉన్ననీటిని సక్రమంగా ఫిల్టర్ చేయడం లేదు.వీటిని పైపుల ద్వారా జనానికి సరఫరా చేస్తున్నారు. నీళ్లు కూడా నల్లగానూ, మలినం గానూ ఉంటున్నాయి. తేటగా ఉండటంలేదు. వర్షపు నీటిరంగులోనే కుళాయిల్లో నీళ్లు వస్తున్నాయి. వీటిని తాగడం వల్లనే సగం రోగాలు వస్తున్నాయి. నీటిని సక్రమంగా శుద్ధిచేయడానికి ఫిల్టర్‌బెడ్‌లు దెబ్బతిన్నాయి. రిపేర్లులేవు. చాలా చోట్ల పంప్ కాలూ మూతపడ్డాయి. మొక్కుబడిగా తాగునీటిని ఇస్తున్నారు. వాటర్‌ప్లాంట్ల వద్ద డబ్బాలు కొనుక్కోని తాగేవాళ్లూ రోగాల బారినపడుతున్నారు. ఏదేమైనా సీజనల్ వ్యాధులు జనాన్ని పట్టిపీడిస్తున్నాయి. వైద్యశాఖ అప్రమత్తం కావాల్సి ఉంది.



వైద్యశాలలో చికిత్స పొందుతున్న జ్వర పీడితులు

వర్షం కోసం

రైతుల ఎదురు చూపులు

- ఎండుతున్న పైర్లు
- చివరి భూములకు అందని నీరు
- పంటలను కాపాడుకునేందుకు


రైతుల ఇక్కట్లు

ప్రజాశక్తి - బాపట్ల జిల్లా

గత జూన్,జూలైలో వర్షాలు విస్తారంగా కురిశాయి. జలాశయాలు నిండాయి. కృష్ణా పశ్చిమ డెల్టాలో పంటల సాగు కోసం కొమ్మమూరు కాలువకు నీరు విడుదల చేశారు. బాపట్ల జిల్లా పరిధిలోని వేమూరు, రేపల్లే, బాపట్ల ప్రాంతాల రైతులు వరి సాగు చేశారు.కొందరు వెదపద్ధతిలో సాగుచేశారు. మరికొందరు వరినార్లు పోసి నాట్లు వేశారు. అయితే ఆగస్టులో సాధారణ వర్షపాతం కూడా నమోదు కాలేదు. విపరీతమైన ఎండలు కాస్తున్నాయి. మాగాణి భూములకు సరిపడా నీరందక రైతులు ఆందోళన చెందుతున్నారు. ప్రధానంగా కొమ్మమూరు కాలువ చివరి భూములకు సాగునీరు అందడం లేదు. ఖరీఫ్‌లో వరి సాగు సాధారణ విస్తీర్ణం 1,03,790 హెక్టార్లు కాగా, ఇప్పటి వరకు జిల్లాలో 37 వేల హెక్టార్లలో వరి సాగు చేశారు. వివిధ రకాల పంటల సాగు సాధారణ విస్తీర్ణం 1,41,916 హెక్టార్లు కాగా,ఇప్పటి వరకూ 46 వేల హెక్టార్లలో మాత్రమే పంటలు సాగు చేశారు. ప్రస్తుతం పంటల సాగుకు వాతావరణం అనుకూలించని కారణంగా ఆరుతడి పంటల సాగుకు కూడా రైతులు సందేహిస్తున్నారు. వేమూరు, కొల్లూరు, బట్టిప్రోలు ప్రాంతాల్లో వెదజల్లే పద్ధతిలో వరిసాగు చేపట్టారు. ఈ ఏడాది ఖరీఫ్ సీజన్ ప్రారంభంలో సక్రమంగా వర్షాలు కురవక,సాగునీరు అందించాల్సిన జలాశయాల్లో నీరు లేక రైతులు వ్యవసాయ పనులు చేపట్టేందుకు సందేహించారు. పట్టిసీమ నుంచి కృష్ణా బ్యారేజీకి నీరు విడుదల కావడం, అక్కడి నుంచి కృష్ణా కాలువ ద్వారా పశ్చియ డెల్టాకు నీటి విడుదల చేశారు. జూలైలో విస్తారంగా వర్షాలు పడ్డాయి. దీంతో కొమ్మమూరు కాలువల లోకి నీరు రావడంతో వేమూరు,రేపల్లే, బాపట్ల వ్యవసాయ డివిజన్ల పరిధిలో వరినార్లు పోసి, నాట్లు వేశారు. విపరీతమైన ఎండలు, కొమ్మమూరు కాలువ నుంచి అవసరమైన రీతిలో సాగునీరు విడుదల జరగక పోవడం, ఆ సాగునీరు కూడా కాలువ చివరి భూములకు చేరక రైతులు ఆయిల్‌ఇంజిన్ల కోసం పరుగులుతీస్తున్నారు.కొన్ని ▶ 2లో



ఆయిల్ ఇంజన్ ద్వారా నీరు పెట్టుకుంటున్న రైతులు



నీరులేక ఎండుముఖం పట్టిన వరిపైరు



నివాళులర్పిస్తున్న మంత్రి స్వామి

రాజకీయాల్లో కష్టపడి ఎదిగిన వ్యక్తి డేవిడ్ రాజు ▶ 3లో



ధర్నా నిర్వహిస్తున్న టోల్‌ప్లాజా కార్మికులు

కార్మికుడిని విధుల్లోకి తీసుకోవాలని ధర్నా ▶ 4లో

వర్షం కోసం
రైతుల ఎదురు చూపులు

(మొదటిపేజీ తరువాయి)

ప్రాంతాల్లో ఇంజిన్లకు కూడా నీరు అందని పరిస్థితి ఉంది. వెద పద్ధతిలో సాగు చేసిన వరి పైరు ఎండుముఖం పడుతుంది. సాధారణంగా వ్యవసాయ సీజన్ సమయంలో వర్షాలు పడితే కాలువలకు వచ్చే నీటితో పైర్లు కళకళలాడుతాయి.

ఈ నెలంతా వర్షాలు లేవు.వాతావరణం పొడిగా మారింది. కాలువ ఎగువ భాగంలోని రైతులు సాగు నీరు అధికంగా వినియోగిస్తున్నారు. ఫలితంగా చివరి భూములకు సాగునీరు అందటం లేదు. అధికారులు వారబందీ విధానాన్ని అమలు చేసి చివరి భూముల రైతులకు నీరందించే చర్యలు చేపట్టాల్సి ఉంది. నూతన ప్రభుత్వంలో పంట కాలువలకు బాగు చేసి కట్టలను పటిష్టం చేస్తారని రైతులు భావించారు. కొంత మేర తూడికాడ తొలగించడం తప్ప కాలువలకు పూర్తి స్థాయిలో మరమ్మతులు చేపట్టలేదు. నీరు అధికంగా కాలువలకు విడుదల చేస్తే గట్లకు గండ్లు పడతాయేమో అనే సందేహాలు కూడా ఉన్నాయి. అందువల్ల కాలువల ద్వారా నీటిని తక్కువగానే విడుదల చేస్తున్నారు. వర్షాలు కురవక, కాలువల ద్వారా సాగునీరు రాక పంటను కాపాడుకునేందుకు రైతులు అవస్థలు పడుతున్నారు. కొందరు ఆయిల్ ఇంజిన్ల ద్వారా పంటలకు నీరు పెట్టుకుంటున్నారు. అయితే వారిపై అదనపు భారం పడుతుంది .కాలువల ద్వారా వస్తున్న కొద్దిపాటి నీటితో పాటు వర్షాలు పడితనే పంటలు కాపాడుకోవచ్చునని రైతులు చెబుతున్నారు.

ఆలయ ఆదాయం రూ.2,82,000

ప్రజాశక్తి-సిఎస్‌పురం

మిట్టపాలెం నారాయణస్వామి ఆదివారం ఆదాయం రూ.2,82,000 వచ్చినట్లు ఇఓ గిరిరాజు నరసింహబాబు తెలిపారు. టికెట్ల అమ్మకం ద్వారా రూ.1,15,490, ప్రసాదాల ద్వారా రూ.37,540, శాశ్వత అన్నదానానికి రూ.56,506, మహాప్రాకారం ద్వారా రూ.33,464, ఇతర విరాళాల ద్వారా రూ.39,000 వచ్చినట్లు తెలిపారు. మహా ప్రాకార నిర్మాణానికి విరాళం పల్నాడు జిల్లా రొంపిచర్ల మండలం విప్పర్లపల్లి గ్రామానికి చెందిన పొందుగుల బ్రహ్మారెడ్డి, నారాయణమ్మ దంపతులు రూ.25,116 రూపాయలు ఇచ్చినట్లు తెలిపారు.



ఈ క్రాప్ నమోదు చేస్తున్న వ్యవసాయ శాఖ సహాయకురాలు సాయిప్రియ

ఈ క్రాప్ నమోదుతో రైతులకు ప్రయోజనం

ప్రజాశక్తి-పిసిపల్లి

ఈ క్రాప్ నమోదుతో రైతులకు ప్రయోజనాలు ఉన్నాయని మురుగుమ్మి వ్యవసాయ శాఖ సహాయకురాలు సాయిప్రియ అన్నారు. రైతులు సాగు చేసుకునేటప్పుడు ఈ క్రాప్ నమోదు చేసుకోవడం వలన ప్రభుత్వం వారికి అనేక రాయితీలు కల్పిస్తుందని తెలిపారు. రైతులు అవసరమైన ఎరువులు, పురుగు మందులు సబ్సిడీ ధరకు లభిస్తాయన్నారు. పంట నష్టం వచ్చినప్పుడు బీమా కూడా ఈ క్రాప్ నమోదు చేసుకున్న రైతులకే వర్తిస్తుందని సాయిప్రియ తెలిపారు. కావున నేటి నుంచి మురుగుమ్మి రెవెన్యూ పరిధిలో ఈ క్రాప్ నమోదు చేస్తున్నామని, ప్రతి రైతు నమోదు చేయించుకోవాలని ఆమె తెలిపారు. రైతులు పొలాల వద్ద ఉండాలని, ప్రతి రైతు పొలంలోకి వచ్చి ఈక్రాపు నమోదు చేస్తారని తెలిపారు. రైతులు ఈ అవకాశాన్ని ఉపయోగించుకొని ఖరీఫ్ సీజన్లో పంటలు సాగుచేసిన ప్రతి ఒక్కరు కూడా నమోదు చేయించుకోవాలని ఆమె రైతులను కోరారు.



పనులను పరిశీలిస్తున్న మున్సిపల్ చైర్మన్ గఫార్

పూడికతీత పనులు పరిశీలన

ప్రజాశక్తి-కనిగిరి

సైడ్ కాలువల్లో నిత్యం పూడిత తీస్తూ మురుకు నీరు ఎక్కడ కూడా నిల్వ ఉండకుండా ప్రత్యేక చర్యలు తీసుకోనున్నట్లు కనిగిరి మున్సిపల్ చైర్మన్ అబ్దుల్ గఫార్ అన్నారు. సోమవారం కనిగిరి పట్టణంలోని ఉప్పు రోడ్డులో డ్రైనేజీ కాలువల్లో పూడికతీత పనులను మున్సిపల్ చైర్మన్ అబ్దుల్ గఫార్ పరిశీలించారు. దశాబ్దాలుగా కాలువల్లో పేరుకుపోయిన పూడును తీసి నీరు సాఫీగా వెళ్లేలా చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. మున్సిపాలిటీ పరిధిలోని కాలువల్లో ఈ పనులు చేపట్టి ఎక్కడ డ్రైనేజీ నీరు కానీ, వర్షపు నీరు కానీ నిల్వ ఉండకుండా చర్యలు తీసుకుంటామని అన్నారు. కార్యక్రమంలో మాజీ ఏఎంసి డైరెక్టర్ బొట్టు శ్రీను, దాసరి మురళి, అరుణోదర్, మున్సిపల్‌కార్మికులు పాల్గొన్నారు.

సిఐని కలిసిన టిడిపి నాయకులు

ప్రజాశక్తి-కొనకనమిట్ల

12నూతనంగా బాధ్యతలు చేపట్టిన పొదిలి సర్కిల్ ఇన్‌స్పెక్టర్ టి వెంకటేశ్వర్లను సోమవారం పొదిలి సర్కిల్ కార్యాలయంలో కొనకనమిట్ల మండలం వాగుమడుగు పంచాయతీ మాజీ సర్పంచ్ కదమ ప్రసాదరావు, టిడిపి నాయకులు కెవిఆర్ వెంకటేశ్వర్లు సోమవారం మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేసి శాలువాతో సన్మానించారు. ఈ సందర్భంగా మాజీ సర్పంచ్ ప్రసాద్ రావు, టిడిపి నాయకులు కెవిఆర్ వెంకటే శ్వర్లు పంచాయతీలోని సమస్యలతో పాటు మండలంలోని పలు సమస్యలను ఆయన దృష్టికి తీసుకువచ్చారు. సిఐ వెంకటేశ్వర్లు మాట్లాడుతూ శాంతి భద్రత లకు భంగం వాటిల్లకుండా పొదిలి సర్కిల్ పరిధిలోని ప్రజలందరూ పోలీస్ సిబ్బందికి సహకరించాలని కోరారు. కార్య కమంలో మాజీ సర్పంచ్ ప్రసాదరావు, కెవిఆర్ వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.



సీఐ వెంకటేశ్వర్లును శాలువాతో సన్మానించిన వాగుమడుగు టిడిపి నాయకులు



డ్రైవర్లకు అవగాహన కల్పిస్తున్న ఎస్ఐ మహేశ్

రోడ్డు ప్రమాదాల నివారణపై ఆటో డ్రైవర్లకు అవగాహన

ప్రజాశక్తి-పెద్దదోర్నాల

పెద్దదోర్నాలలోని పోలీస్ స్టేషన్ ఆవరణలో నూతన ఎస్సై వి.మహేష్ ఆధ్వర్యంలో సోమవారం ఆటో, కారు డ్రైవర్లకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. అతివేగంగా వాహనాలు నడిపితే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. వాహనాలు నడిపి ప్రయాణికుల మరణానికి కారణమైతే క్రిమినల్ కేసులు పెడతామన్నారు. మితిమీరిన వేగంతో, అలాగే పరిమితికి మించి వాహనాలు నడిపవద్దని సూచించారు. ట్రాఫిక్ నిబంధనలు ఉల్లంఘనలకు పాల్పడితే ఎంతటి వారైన విడిచిపెట్టేది లేదన్నారు. యూనిఫాం తప్పనిసరిగా ధరించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

స్కూలుకెళ్లాలంటే భయం.. భయం..

పాఠశాలకు వెళ్లే దారిలో మద్యం దుకాణం

ప్రజాశక్తి-కంభం రూరల్

మండలంలోని నర్సిరెడ్డిపల్లి గ్రామం నుండి రెండు కిలీమీటర్ల దూరంలోని తురిమెల్ల ప్రభుత్వ ఉన్నత పాఠశాలకు విద్యార్థులు రోజూ నడిచి వెళ్తుంటారు. ఈ గ్రామానికి పాఠశాలకు మధ్యలో మద్యం దుకాణం ఉంది. మద్యం దుకాణం వద్ద రోడ్డు పైనే మద్యం తాగడం, మందుబాబులు రోడ్డు పక్కనే మూత్ర విసర్జన చేస్తుండటం, రోడ్డుకు అడ్డంగా వాహనాలు ఉంచుతుం డటంతో విద్యార్థులు భయాందోళనలకు గురవుతున్నారు. బాలికలు రోజూ పాఠశాలకు నడిచి వెళ్తుంటే రోడ్డు పక్కనే గుంపులుగా కూర్చోని మద్యం తాగుతుండటంతో భయపడుతున్నారు. వయస్సుతో సంబంధం లేకుండా చిన్న పిల్లలు, మహిళలపై జరుగుతున్న అత్యాచారాలు జరుగుతుండటంతో బాలికల తల్లిదండ్రులు ఆందోళన చెందుతున్నారు. ఉన్నతాధికారులు స్పందించి మద్యం దుకాణాన్ని వేరే ప్రాంతానికి మార్చాలని నర్సిరెడ్డిపల్లి గ్రామస్థులు కోరుతున్నారు.

ప్రభుత్వ భూమి ఆక్రమణ

విలువైన స్థలంపై అక్రమార్కుల కన్ను

పట్టించుకోని రెవిన్యూ అధికారులు



ఆక్రమణకు గురైన ప్రభుత్వ భూమి

ప్రజాశక్తి-త్రిపురాంతకం

త్రిపురాంతకంలో జాతీయ రహదారి ప్రక్కనే ఉన్న విలువైన భూమిపై అక్రమార్కులు కన్నేశారు. ప్రభుత్వ స్థలంలో కంకర, మట్టి కుప్పలు పోసి యథేచ్ఛగా వాడుకుంటున్నారు. త్రిపురాంతకంలోని సర్వే నెంబర్ 482లో 1.42 ఎకరాల ప్రభుత్వ భూమి ఆర్ఎస్ఆర్‌లో బండ్లబాటగా నమోదై ఉంది. ఈ భూమి గుంటూరు-కర్నూలు జాతీయ రహదారికి ఆనుకొని ఉంది. త్రిపురాంతకం పాత పోలీస్ స్టేషన్ సమీపాన ఉన్న ఈ స్థలం జాతీయ రహదారి పక్కనే ఉండటంతో ఈ భూమిపై అక్రమార్కుల కన్ను పడింది. పార్టీలకు అతీతంగా ఒక్కటయ్యారు. గత ప్రభుత్వంలో భూమిపై పత్రికల్లో వార్తలు రావడంతో అప్పటి తహశీల్దార్ 'ఇది ప్రభుత్వ భూమి' అని ఫ్లెక్సీ పెట్టి చేతులు దులుపుకున్నారు. కాగా గ్రామ పెద్దలు కొందరు రియల్ ఎస్టేట్ వ్యాపారులతో చేతులు కలిపి ఎవరి స్థాయిలో వారు లక్షల్లో సొమ్ము చేసుకుంటున్నట్లు సమాచారం. రియల్ ఎస్టేట్ వ్యాపారులు గత ఐదు ఆరు సంవత్సరాలుగా ఆ భూమిపై బోరు ఏర్పాటు చేసి కంకర కుప్పలు, మట్టి కుప్పలు, తిప్పర్లు, లారీలు స్టాండ్‌గా మార్చారు. ఆక్రమాదారుడు వీటన్నింటిని అక్కడ నిలుపు కుంటూ ఆ భూమిని వాడుకుంటూ ప్రైవేటు భూమిగా చిత్రీకరించారు. ఆ భూమిని సొంతం చేసుకునేందుకు పావులు కదుపుతున్నారు. దీనికి తోడు రెవిన్యూ అధికా రులు వారికి చేతులు కలిపినట్లు ప్రజలు విమర్శిస్తున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి చుట్టూ కంచె వేసి ప్రభుత్వ స్థలాన్ని కాపాడాలని ప్రజలు కోరుతున్నారు.

ప్రజలందరూ సామరస్యంగా మెలగాలి

మార్కాపురం సిఐ ఆవుల వెంకటేశ్వర్లు



మాట్లాడుతున్న సిఐ వెంకటేశ్వర్లు

ప్రజాశక్తి-మార్కాపురం

అన్ని వర్గాల ప్రజలు, అన్ని రాజకీయ పార్టీల నాయకులు, కార్యకర్తలు సామరస్యంగా మెలగాలని మార్కాపురం సిఐ ఆవుల వెంకటేశ్వర్లు కోరారు. స్థానిక పట్టణ పోలీస్ స్టేషన్ ఆవరణలో మార్కాపురం పట్టణం, మార్కాపురం మండలంలోని అన్ని గ్రామాల వివిధ రాజకీయ పార్టీల నేతలతో సమావేశం సోమవారం సాయంత్రం నిర్వహించారు. ఈ సందర్భంగా సిఐ వెంకటేశ్వర్లు మాట్లాడారు. సమాజంలో ఎలా వ్యవహరించాలో వివరించారు. అసాంఘిక కార్యకలాపాలకు దూరంగా ఉండాలన్నారు. ప్రధానంగా మార్కాపురం పట్టణంలో ట్రాఫిక్ సమస్య అధికంగా ఉందని, దాన్ని నివారించేందుకు ప్రజలు సహకరించాలని విజ్ఞప్తి చేశారు. ఈ సమావేశంలో పట్టణ ఎస్ఐ డి.సైదుబాబు, మార్కాపురం రూల్ ఎస్ఐ పి.అంకమరావు, ట్రైనీ ఎస్ఐ రాజమోహన్‌రావు తదితరులు పాల్గొన్నారు.



గాయపడిన మరియమ్మ

తల్లిపై గొడ్డలితో దాడి

నగదు వ్యవహారంలో తల్లీ కొడుకుల మధ్య గొడవ

ప్రజాశక్తి-త్రిపురాంతకం

త్రిపురాంతకం మండలం రాజుపాలెం గ్రామంలో తల్లిపై కొడుకు గొడ్డలితో దాడిచేసిన సంఘటన సోమవారం చోటు చేసు కుంది. స్థానికులు తెలిపిన వివరాల మేరకు.. నార్నెపాటి మరియమ్మకు ఇద్దరు కుమారులు. ఆమె పెద్ద కుమారుడైన త్రిపురయ్య మొదటి భార్య చనిపోవడంతో రెండో వివాహం చేసుకున్నాడు. మొదటి భార్యకు ఇద్దరు సంతానం. వీరిద్దరినీ వాళ్ళ నాయనమ్మ అయిన మరియమ్మ పెంచి పెద్ద చేసింది. ఏడాది క్రితం అప్పటి మంత్రి ఆదిమూలపు సురేష్ ఎస్కార్ట్ కాన్వాయి ఢీకొని త్రిపురయ్య మొదటి భార్య కుమారుడైన ఇశ్రాయేలు మృతి చెందడంతో ఆర్థిక సాయంగా కొంత నగదును ఇశ్రా యేలు నాయనమ్మ అయిన మరియమ్మకు వైసీపీ నాయకులు అందజేశారు. ఆ డబ్బులో తనకూ వాటా ఇవ్వాలని త్రిపుర య్య మరియమ్మను అడిగాడు. ఈ నేపథ్యంలో జరిగిన గొడ వలో త్రిపురయ్య గొడ్డలితో ఆమెపై దాడి చేశాడు. తీవ్ర గా యాలు కావడంతో మెరుగైన వైద్యం నిమిత్తం ఆమెను అంబు లెన్స్‌లో యర్రగొండపాలెం ప్రభుత్వ ఏరియా వైద్యశాలకు తరలించారు. ప్రస్తుతం ఆమె చికిత్స పొందుతోంది. సమాచారం అందుకున్న పోలీసులు సంఘటన స్థలానికి చేరుకొని కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.



ఎస్ఐని సన్మానిస్తున్న టిడిపి నాయకులు

ఎస్ఐని కలిసిన టిడిపి నాయకులు

ప్రజాశక్తి - బేస్తవారిపేట

నూతనంగా విధుల్లో చేరిన బేస్తవారిపేట ఎస్ఐ ఎస్వీ రవీంద్రారెడ్డిని మండలంలోని తెలుగుదేశం పార్టీ నాయకులు సోమవారం కలిసి అభినందనలు తెలిపారు. అనంతరం ఎస్సైని శాలువా, పూలమాలతో సత్కరించారు. అభినందనలు తెలిపిన వారిలో తెలుగుదేశం పార్టీ నాయకుడు పూనూరు భూపాల్ రెడ్డి, టిడిపి పట్టణ అధ్యక్షుడు దూదేకుల సైదులు, స్వప్న హోటల్ యజమాని సత్తేలీ కృష్ణ యాదవ్, పెద్ద ఓబినేనిపల్లి టిడిపి నాయకులు వెన్న కృష్ణారెడ్డి, సందు రమేష్, టిడిపి నాయకులు ముప్పూరి రాము, క్లస్టర్ ఇంచార్జి ఎస్.కె భాష, ఏడవ వార్డు మెంబర్ దూదేకుల శివ, టిడిపి నాయకులు దూదేకుల నాగూర్, బి అమృత రాజు, రైస్ మిల్ యజమానులు మట్టా వెంకట రమేష్ బాబు, మట్టా శేషారావు తదితరులు ఉన్నారు.

జూదరులు అరెస్టు

ప్రజాశక్తి-టంగుటూరు

మండలంలోని పొందూరు గ్రామంలో పేకాట ఆడుతున్న ఆరుగురిని టంగుటూరు ఎస్సై నాగమల్లీశ్వరరావు అరెస్టు చేశారు. వారి నుంచి రూ.11,138 నగదు స్వాధీనం చేసుకున్నారు. కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

కొమరోలు: కొమరోలు మండలంలోని ఎడమకళ్ల గ్రామం లో ఆదివారం పేకాట ఆడుతున్న నలుగురిని అదుపులోకి తీసుకున్నట్లు ఎస్సై మధుసూదన్ రావు తెలిపారు. రూ.9,500 నగదును స్వాధీనం చేసుకొని కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు. ఈ కార్యక్రమంలో హెడ్ కానిస్టేబుల్ నారాయణ, సిబ్బంది నాగేశ్వరరావు, అంజి నాయక్, శివరామ్ తదితరులు పాల్గొన్నారు.

పొగాకు బ్యారెన్లు అధిక ధరలకు కౌలుకు తీసుకోవద్దు

వేలం కేంద్రాన్ని పరిశీలించిన పొగాకు బోర్డు ఛైర్మన్ యశ్వంత్ కుమార్



పొగాకు బోర్డు ఛైర్మన్ యశ్వంత్ కుమార్‌కు స్వాగతం పలుకుతున్న అధికారులు

ప్రజాశక్తి-టంగుటూరు

బ్యారన్‌లు, పొలాలు అధిక ధరలకు కౌలుకు తీసుకొని నష్టపోవద్దని పొగాకు బోర్డు ఛైర్మన్ యశ్వంత్ కుమార్ అన్నారు. సామవారం పొగాకు వేలం కేంద్రాన్ని ఆయన సందర్శించి వేలం వేదికను, వేలం ప్రక్రియను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పొగాకు అక్రమ విక్రయాల్లో పాల్గొనవద్దని రైతులకు సూచించారు. రైతులకు ప్రస్తుత మార్కెట్‌లో ఉన్న పర్యవసానాలను ఆయన వివరించారు. ప్రభుత్వం వారితో మాట్లాడి రైతుల వద్ద అధికంగా ఉన్న పొగాకు అమ్ము కొనుటకు అపరాధ రుసుం లేకుండా అనుమతి తీసుకు వచ్చిన విధానం గురించి వివరించారు. బోర్డు సూచనలు పాటిస్తూ మంచి నాణ్యమైన పొగాకు పండించి మంచి లాభాలు పొందాలని సూచించారు. ప్రపంచ వ్యాప్తంగా పొగాకు వినియోగం తగ్గించటం వలన వీలైనంత వరకు రైతులు ప్రత్యమ్నాయ పంటల వైపు మొగ్గు చూపాలని కోరారు. టంగుటూరు పొగాకు వేలం కేంద్రంలో అభివృద్ధి పనుల గురించి ఛైర్మెన్ యశ్వంతకుమార్‌కు వేలం నిర్వహణాధికారి శ్రీనివాసరావు వివరిం చారు. టంగుటూరు వర్జీనియా పొగాకు ఉత్పత్తిదారుల సంఘం ఆధ్వర్యంలో యశ్వంత్ కుమార్‌ను ఘనంగా సన్మా నించారు. ఈ కార్యక్ర మంలో పొగాకు బోర్డు వేలం నిర్వహణాధికారి అ ట్లూరి శ్రీనివాసరావు, సీని యర్ గ్రేడింగ్ ఆఫీసర్ జి.సిద్ధరాజు, పొగాకు బోర్డు సభ్యులు మారెడ్డి సుబ్బారెడ్డి, పి.వర ప్రసాదరావు, రైతు సంఘం అధ్యక్షుడు పోతుల నరశింహారావు, సిబ్బంది, అన్ని కంపెనీల ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.



పొగాకును పరిశీలిస్తున్న యశ్వంత్ కుమార్

పొగాకు బేళ్ల అమ్మకం

టంగుటూరు పొగాకు వేలం కేంద్రానికి దావగూడూరు, చింతలపాలెం గ్రామాల రైతులు 951 బేళ్లను అమ్మకానికి తెచ్చారు. అందులో 780 బేళ్లు అమ్ముడు పోయాయి. వివిధ కారణాల చేత 171 బేళ్లను తిరస్కరించారు. కిలో పొగాకు అత్యధిక ధర రూ.358, కిలో పొగాకు అత్యల్ప ధర రూ.205, సరాసరి ధర రూ.305.17 పైసలు పలికింది.

కొండపి: అనాధికార బ్యారన్‌లపై చర్యలు తీసుకుంటామని పొగాకు బోర్డు ఛైర్మన్ యశ్వంత్ కుమార్ అన్నారు. సోమవారం కొండపి పొగాకు కొనుగోళ్లను పరిశీలించారు. అనంతరం బోర్డులో రైతులతో ప్రత్యేకంగా సమావేశమయ్యారు. రాబోయే సీజన్‌లో పంట పరిమాణాన్ని స్థిరీకరించడం, ఉత్పత్తి నియంత్రణ వెనుక కారణాలను వివరించారు. బ్యారన్, పొలాలు అధిక కౌలు ధరలకు తీసుకోవద్దని హెచ్చరించారు. బోర్డు నిర్ణయించిన మేరకు రాబోయే కాలంలో పొగాకు సాగు చేయాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో పొగాకు బోర్డు సభ్యులు మారెడ్డి సుబ్బారెడ్డి, బొడ్డపాటి బ్రహ్మయ్య, బోర్డు సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

తొలగించిన కార్మికుడిని విధుల్లోకి తీసుకోవాలి

టోల్ ప్లాజా వద్ద సిఐటియు ధర్నా

ప్రజాశక్తి - మార్టూరు రూరల్

టోల్ ప్లాజాలో పనిచేస్తున్న కార్మికుల సమస్యలు పరిష్కరించి, కనీస వేతనాలు అమలు చేయాలని ప్రశ్నించిన కార్మికుడిపై కక్షసాధింపు చర్యలు మానుకోవాలని సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి సిహెచ్ మజుందార్ డిమాండ్ చేశారు. కార్మికుడిని ప్రక్క రాష్ట్రానికి బదిలీ చేసి, విధుల్లో చేరలేదనే కారణంతో ఉద్యోగ బాధ్యతల నుండి తొలగించిన సింహపురి ఎక్స్ ప్రెస్ వే లిమిటెడ్ పరిధిలోని రేసి యాజమాన్య నిరంకుశ ధోరణిని ఆయన ఖండించారు. బొల్లాపల్లి టోల్ ప్లాజా వద్ద సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు బత్తుల హనుమంతరావు, జె పంగులూరు, మార్టూరు రైతు సంఘం నాయకులతో కలిసి సోమవారం ధర్నా నిర్వహించారు. ధర్నాలో మజుందార్ మాట్లాడుతూ గత 20ఏళ్లుగా చాలీ, చాలని వేతనాలతో ఉద్యోగ బాధ్యతలు నిర్వహిస్తున్న టోల్ ప్లాజా కాంట్రాక్టు, అవుట్ సోర్సింగ్ కార్మికులకు కనీస వేతనాలు అమలు చేయాలని, కార్మికుల న్యాయమైన డిమాండ్లు పరిష్కరించాలని సిఐటియు సహకారంతో గత కొద్దీ రోజులుగా టోల్ ప్లాజా యూనియన్ తరపున ఆందోళనలు నిర్వహిస్తూ రేసి యజమాన్యన్ని ప్రశ్నిస్తున్న యూనియన్ కార్యదర్శి శ్రీనివాసరాజును మహారాష్ట్రకు బదిలీ చేశారని అన్నారు. ఇతర కార్మికులను ఎటువంటి నోటీసు లేకుండా విధుల నుండి తొలగించడం దారుణమని పేర్కొన్నారు. టోల్ ప్లాజా కార్మికులతో యూనియన్ ఏర్పాటు చేయడాన్ని మొదటి నుండి వ్యతిరేకిస్తున్న రేసి యాజమాన్యం నిరంకుశ ధోరణిని వీడాలని కోరారు. కార్మికుల న్యాయమైన డిమాండ్లు పరిష్కరించాలని డిమాండ్ చేశారు. బొల్లాపల్లి పరిసర ప్రాంతంలో స్థానికంగా ఉన్న యువకులకు ఉపాధి లభిస్తుందనే రైతుల తమ భూములను సింహపురి ఎక్స్‌ప్రెస్ వే టోల్ ప్లాజాకు ఇచ్చారని గుర్తు చేశారు. అక్రమ బదిలీని నిలిపి వేయాలని అన్నారు. తొలగించిన కార్మికులను తిరిగి విధుల్లోకి తీసుకోవాలని సాక్షాత్తు రాష్ట్ర విద్యుత్ శాఖ మంత్రి టోల్ ప్లాజా యాజమాన్యాన్ని ఫోనులో కోరితే పట్టించుకోకపోవడం దారుణమని విమర్శించారు. రైతు సంఘం జిల్లా కార్యదర్శి తల్లపనేని రామారావు, ఉపాధ్యక్షులు కందిమళ్ల రామకోటేశ్వరరావు, పంగులూరు, మార్టూరు రైతు సంఘం నాయకులు మాట్లాడుతూ నేటి ధరలకు అనుగుణంగా కార్మికుల వేతనాలు పెంచడానికి టోల్ ప్లాజా యాజమాన్యం తక్షణమే చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. దీర్ఘకాలంగా అపరిష్కృతంగా ఉన్న కార్మికుల పాత బకాయిలు వెంటనే చెల్లించాలని కోరారు. అక్రమంగా మహారాష్ట్రకు బదిలీ చేసిన కార్మికుడి బదిలీని నిలిపివేయాలని కోరారు. అనంతరం రేసి కార్యాలయం వరకు ర్యాలీగా వెళ్లి టోల్ ప్లాజా మేనేజర్ కిరణ్‌కు వినతి పత్రం అందజేశారు. కార్మికుల సమస్యలు పరిష్కరించని పక్షంలో సిఐటియు ఆధ్వర్యంలో ఆందోళన ఉధృతం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో బైట మంజులూరు సర్పంచ్ చక్రవరం తిరుమలరాజు, గుడిపాటి మల్లారెడ్డి, వీరవల్లి కృష్ణమూర్తి, ఎనికపాటి రాంబాబు, ఎం బాబు,షేక్ గఫూర్, పూసపాటి సుబ్బరాజు, రామ చంద్రరాజు, చక్రవరం సుబ్బరాజు, టోల్ ప్లాజా కార్మికులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి సిహెచ్.మజుందర్

షార్ట్ సర్క్యూట్‌తో అగ్నిప్రమాదం

- 9 గృహాలు దగ్ధం
- కట్టుబట్టలతో మిగిలిన గిరిజనులు
- తక్షణ సహాయం అందజేసిన ఎంఎల్ఎ, కలెక్టర్

ప్రజాశక్తి - కర్లపాలెం

విద్యుత్ షార్ట్ సర్క్యూట్ కారణంగా భారీ అగ్ని ప్రమాదం జరిగి తొమ్మిది ఇళ్లు దగ్ధమైన సంఘటన స్థానిక లంక కాలువ కట్టపై సోమవారం జరిగింది. లంక కాలువ కట్టపై గిరిజనులు నివశిస్తున్నారు. సోమవారం యధా విధిగా పనులు నిమిత్తం బయటకు వెళ్లగా ఒక్కసారిగా విద్యుత్ షార్ట్ సర్క్యూట్ వచ్చి ఇళ్లు ఒకదానికి ఒకటి వెంట వెంటనే అగ్నికి ఆహుతయ్యాయి. సమాచారం తెలుసుకున్న కలెక్టర్ జె వెంకట మురళి సంఘటన స్థలానికి చేరుకొని దగ్ధమైన ఇళ్ల బాధితులకు అన్నీ సదుపాయాలతో త్వరలో పక్కా ఇళ్లు నిర్మిస్తామని హామీ ఇచ్చారు. సంఘటన వివరాలు అడిగి తెలుసుకున్నారు. సంఘటన జరిగినప్పుడు బాధితులు కూలి పనులకు వెళ్లి ఉన్నందువల్ల ఘటనస్థలిలో ఎవరు లేరని బాధితులు తెలిపారు. ప్రాణ నష్టం జరగలేదు. వెంటనే నిత్యవసర వస్తువులు అందజేసి భోజన ఏర్పాట్లు చేసి ప్రతి కుటుంబానికి రూ.5వేల చొప్పున తక్షణ ఆర్థిక సహాయం కలెక్టర్ అందజేశారు. ప్రమాద విషయాన్ని వెంటనే ప్రభుత్వ దృష్టికి తీసుకువెళ్లి రూ.40వేలు వచ్చే విధంగా ఆర్థిక సహాయం అందిస్తామని, ప్రభుత్వం తరఫున రూ.4లక్షలతో మౌలిక సదుపాయాలతో కూడిన పక్కా ఇల్లు నిర్మించి ఇచ్చేస్తామని హామీ ఇచ్చారు. బాధితులను అన్ని విధాలా ప్రభుత్వం ఆదుకుంటుందని తెలిపారు. కలెక్టర్ వెంట జాయింట్ కలెక్టర్ బి సుబ్బారావు, ఆర్డీఓ రవీందర్, తహశీల్దారు వెంకటరత్నం, ఎస్ఐ రవీంద్ర, విఆర్ఓ ఉన్నారు.



బాధితులను పరామర్శిస్తున్న కలెక్టర్ జెవి మురళి



అగ్ని ప్రమాద బాధితులకు పట్టలు అందజేస్తున్న ఎంఎల్ఎ

ఎంఎల్ఎ నరేంద్రవర్మ పరామర్శ

విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో ఇళ్లు దగ్ధమైన సంఘటన తెలుసుకున్న ఎంఎల్ఎ వేగేశన నరేంద్ర వర్మ సంఘటన స్థలానికి చేరుకొని పరామర్శించారు. తక్షణ సహాయంగా రూ.10వేలు అందజేశారు. ప్రభుత్వ పరంగా అన్ని అందే విధంగా కృషి చేస్తామని అన్నారు. రెడ్ క్రాస్ సభ్యులు నారాయణ బట్టు, ఇనకొల్లు పోలీసురావు బాధితులకు తాత్కాలిక గుడారాలు అందజేశారు. భూపతిరావు, నక్కల వెంకట స్వామి, జడ్పీటీసీ వేణుగోపాలరెడ్డి, బాజి, వసంత్‌రెడ్డి, కట్టా సుజాత, కొండలు, ధనుంజయ్ పాల్గొన్నారు.

పంగులూరులో రాష్ట్రస్థాయి ఖోఖో పోటీలు



ఖోఖో క్రీడాకారులనుద్దేశించి మాట్లాడుతున్న గరటయ్య

ప్రజాశక్తి - పంగులూరు

సెప్టెంబరు 20, 21, 22 తేదీల్లో అండర్- 14 విభాగంలో రాష్ట్ర స్థాయి ఖోఖో పోటీలు పంగులూరులో నిర్వహించనున్నట్లు ఖోఖో అసోసియేషన్ రాష్ట్ర చైర్మన్, మాజీ శాసన సభ్యులు బాచిన చెంచు గరటయ్య విలేకరుల సమావేశంలో సోమవారం తెలిపారు. ఖోఖో రాష్ట్ర కార్యదర్శి మేకల సీతారామిరెడ్డి ఆధ్వర్యంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. గతంలో పంగులూరు గ్రామస్తుల సహకారంతో 10సార్లు రాష్ట్రస్థాయి ఖోఖో పోటీలు, 3సార్లు జాతీయ స్థాయి ఖోఖో పోటీలు అత్యంత వైభవంగా నిర్వహించినట్లు గుర్తు చేశారు. 11వ సారి నిర్వహించే ఈ రాష్ట్రస్థాయి ఖోఖో పోటీలు అత్యంత ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తామని అన్నారు. ఈ పోటీలకు కూడా గ్రామస్తుల సహకారం కావాలని కోరారు. ఖోఖో పోటీలకు రాష్ట్ర స్థాయిలో పంగులూరుకు గుర్తింపు తెచ్చిన మేకల సీతారామిరెడ్డిని అభినందించారు. అనంతరం ఖోఖో రాష్ట్ర కార్యదర్శి సీతారామిరెడ్డి మాట్లాడుతూ ఇన్నేళ్లుగా గ్రామంలో ఖోఖో పోటీలు విజయవంతంగా నిర్వహించడానికి సహకరించిన గ్రామస్తుల సహకారం, బాచిన చెంచు గరటయ్య సహకారం మరువలేనిమని అన్నారు. పంగులూరు గ్రామం నుండి సుమారు 100 మంది ఖోఖో క్రీడ ద్వారా మంచి భవిష్యత్తును సంపాదించుకున్నారని అన్నారు. ఖోఖో ఆటల్లో క్రీడాకారులను ప్రోత్సహించడంలో పంగులూరు గ్రామానికి రాష్ట్రంలో ప్రత్యేక గుర్తింపు తెచ్చే విధంగా గ్రామస్థుల ప్రోత్సాహం ఎంతో అభినందనీయమని అన్నారు. కార్యక్రమంలో మండల పరిషత్ ఉపాధ్యక్షులు యర్రం శ్రీనివాసరెడ్డి, రాయిని వెంకట సుబ్బారావు, తెలుగుదేశం మండల అధ్యక్షులు రావూరి రమేష్ బాబు, రోటరీ క్లబ్ నాయకులు చిలుకూరి వీరరాఘవయ్య, కరణం హనుమంతరావు, ఖోఖో అసోసియేషన్ జిల్లా కార్యదర్శి కాశీ విశ్వనాథరెడ్డి, పిఈటిలు, పీడీలు పాల్గొన్నారు.



రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైన క్రీడాకారులు



దాతల చెక్కులు అందజేస్తున్న ఎంఎల్ఎ కొండయ్య

పేదల ఆకలి తీరుస్తున్న అన్నాక్యాంటీన్

ప్రజాశక్తి - చీరాల

పేదల ఆకలి తీర్చే అన్న క్యాంటీన్‌కు దాతలు సహకరించి భాగస్వామ్యం కావాలని ఎంఎల్ఎ కొండయ్య కోరారు. అన్నా క్యాంటీన్ ప్రారంభించిన శుభ సందర్భంలో పలువురు దాతలు విరాళాలు రూపంలో ఇచ్చిన చెక్కులను తన క్యాంపు కార్యాలయంలో మున్సిపల్ కమిషనర్ చక్రవర్తికి ఆయన చెక్కు రూపంలో సోమవారం అందజేశారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ఏర్పాటు చేసిన అన్నా క్యాంటిన్‌లకు దాతల విరాళాలు సమర్పించాలని ముఖ్యమంత్రి చంద్రబాబు పిలుపు ఇచ్చిన నేపథ్యంలో పలువురు దాతలు విరాళాలు అందజేశారని అన్నారు. ఈ నెల 16న పట్టణంలోని వాసవి క్లాత్ మార్కెట్ వద్ద ఏర్పాటు చేసిన అన్నా క్యాంటీన్‌ను ఎంఎల్ఎ ఎంఎం కొండయ్య, ఎంపి తేనేటి కృష్ణ ప్రసాద్ ప్రారంభించరని అన్నారు. ఈ తరుణంలో ఎంఎల్ఎ కొండయ్య రూ.54వేలు, నల్లపనేని లక్ష్మీకుమారి రూ.1లక్ష, భారత్ ఇండస్ట్రీస్ రూ.11116, అభిరుచి ఫ్యామిలీ రెస్టారెంట్ రూ.51వేలు, ఎబిసి ఫ్యాషన్స్ రూ.50వేలు, ముత్తు కుమార్ రూ.50వేలు, కౌన్సిలర్ పొత్తూరు సుబ్బయ్య రూ.25వేలు, జోగుపర్తి రూ.10116, బాలకృష్ణ, కీర్తి పూర్ణ రూ.10116 మొత్తం కలిసి రూ.5లక్షల చెక్కులు దాతలు విరాళాలుగా ఇచ్చారని అన్నారు. దాతలు అందజేసిన చెక్కులు అన్నింటిని అన్నా క్యాంటీన్ నిర్వహణ నిమిత్తం తమకు అందజేశారని అన్నారు. ఇతరులను మరికొంత మంది నగదు రూపంలో విరలాలు ఇచ్చారని అన్నారు. వివాహాలు, పుట్టిన రోజు వేడుకలు, ఇతర శుభకార్యాలకు పేదల ఆకలి తీర్చాలనుకునే దాతలు అన్నా క్యాంటీన్‌కు సహకరించాలని కోరారు.



పండ్లు పంపిణీ చేస్తున్న గడ్డిపాటి శ్రీనివాసరావు దంపతులు

వృద్ధులకు పండ్లు పంపిణీ

ప్రజాశక్తి - పర్చూరు

రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో వృద్ధులకు పండ్లు, స్వీట్లు పంపిణీ చేశారు. గడ్డిపాటి శ్రీనివాసరావు, విజయలక్ష్మి దంపతుల వివాహ వార్షికోత్సవ సందర్భంగా స్థానిక నేతాజీ వృద్ధుల ఆశ్రమంలోని వృద్ధులకు పండ్లు, స్వీట్లు క్లబ్ అధ్యక్షులు తోకల కృష్ణమోహన్ ఆధ్వర్యంలో సోమవారం పంపిణీ చేశారు. కార్యక్రమంలో కార్యదర్శి కోమటి ఆంజనేయులు, పాబోలు ఉదయభాస్కర్, పాబోలు వెంకన్న, పంబి సదానందరెడ్డి, గడ్డిపాటి శ్రీనివాసరావు దంపతులు, ఆశ్రమ యాజమాన్యం, వృద్ధులు, గ్రామస్తులు పాల్గొన్నారు. ఆశ్రమ నిర్వాహకులు భవనం శ్రీనివాసరెడ్డి, జయలక్ష్మి దంపతులు గడ్డిపాటి శ్రీనివాసరావు దంపతులను అభినందించారు.

బస్సు సర్వీసు పునరుద్ధరణ

ప్రజాశక్తి - అద్దంకి

గతంలో రావినూతల, పమిడిపాడు, చందలూరు, పంగులూరు, ముప్పవరం, అద్దంకి మీదగా బిహెచ్ఈఎల్ సూపర్ లగ్జరీ బస్సు డిపో నుండి నడిపేవారమని, కానీ ప్రయాణికుల సౌకర్యార్థం సోమవారం నుండి పమిడిపాడు నుండి రావినూతల, దైవాలరావూరు, మేదరమెట్ల, అద్దంకి మీదగా బిహెచ్ఈఎల్ సర్వీసు ఒకటి, చందలూరు, పంగులూరు, ముప్పవరం, అద్దంకి మీదగా బిహెచ్ఈఎల్‌కు నడుపుతున్నామని డిపో మేనేజర్ బి రామమోహనరావు తెలిపారు. ఈ అవకాశాన్ని ప్రయాణికులు వినియోగించుకుని ఆర్టీసీ అభివృద్ధికి తోడ్పడాలని కోరారు.

నీరులేక.. సాగు సాగక..

- సౌర విద్యుత్ మోటార్ల కోసం ఎదురుచూపులు
- గత్యంతరం లేక మెట్ట పైర్లు సాగు
- రైతులకు తప్పని ఇక్కట్లు

ప్రజాశక్తి-యర్రగొండపాలెం

నల్లమల ఆటవీ ప్రాంతంలో నివసించే లోతట్టు గూడేలు, తండాల గిరిజనులు ఇప్పటికీ సంప్రదాయ జీవనాధారాన్నే నమ్ముకుని కాలం వెల్లదీస్తున్నారు. అటవీ హక్కు చట్టం ద్వారా వారికి భూములు పంపిణీ చేసినా నీటి వసతి లేక సాగుకు నోచుకోవడం లేదు. లోతట్టు భూముల్లో భూగర్భ జలం పుష్కలంగా ఉన్నా సాగునీరు లేదు.అనేక వ్యయ ప్రయాసలకు ఓర్చి కొందరు మెట్ట పంటలు సాగు చేస్తున్నారు. నీరు అరకొరగానే దిగుబడి వస్తుంది.జలసిరి పథకంలో బోర్లు వేయించి నీటి వసతి కల్పించాలని కోరుతున్నా అటుగా అడుగులు ముందుకు పడడం లేదు.

డీజిల్ ఇంజిన్లతోనే నీరు..

నల్లమల అడవి కోర్ ఏరియాలో ఉండే పాలుట్లలో ఆటవీ హక్కుల చట్టం కింద దాదాపు మూడు వేల ఎకరాల అటవీ భూమిని 500 మంది సుగాలి, చెంచు గిరిజనులకు పంపిణీ



సాగులో ఉన్న పంటలు



పొలాల్లో తవ్వుకున్న బావి

చేశారు. 300 మంది రైతులు తమ భూములను సాగు చేసుకుంటున్నారు. కొందరు సుగాలీలకు పూర్వం తవ్విన బావులు ఉన్నాయి. గత కొన్నేళ్లుగా డీజిల్ ఇంజన్ల సహాయంతో వంద మంది నీటి వసతితో, మిగతా వారంతా మెట్ట పంటలు పండిస్తున్నారు. వీరిలో చెంచు గిరిజనులు కూడా తమ భూములను సాగు చేసుకుంటున్నారు.

సౌర శక్తితో ప్రయోజనం..

అటవీ ప్రాంతం కావడంతో భూగర్భ జలాలు ఇక్కడ పుష్కలంగా ఉన్నాయి. వంద అడుగుల్లోనే భూగర్భ జలం లభ్యమవుతోంది. విద్యుత్ వసతి లేని ఇలాంటి చోట సోలార్ మోటార్లు మంచి ప్రతిఫలాన్నిస్తాయి. జలసిరి పథకంలో మోటార్లు ఏర్పాటు కోసం ఇక్కడి గిరిజనులు కొన్నేళ్ల నుంచి అధికారులకు దరఖాస్తు చేస్తూనే ఉన్నారు. గతంలో ఇందిర జలప్రభ ద్వారా యర్రగొండపాలెం, పుల్లలచెరువు మండలాల్లోని చెంచులకు 80 బోర్లు వేసి విద్యుత్ వసతి కల్పించారు. పాలుట్ల లోతట్టు ప్రాంతం కావడంతో విద్యుత్ లైన్లు వేసే అవకాశం లేదు. అందుకే సోలార్ మోటార్లు ఏర్పాటు చేయాలని విజ్ఞప్తి చేస్తున్నా పట్టించుకునేవారు కరువయ్యారు. వందల ఎకరాల భూమి సస్యశ్యామలమయ్యే అవకాశం ఉన్నా ఆ వైపుగా ప్రయత్నాలు జరగడం లేదు. పాలుట్ల, పొన్నలబయలు, చిన్నారుట్ల, చింతల, తుమ్మలబైలు, గంటవానిపల్లెలో సోలార్ మోటార్ ఏర్పాటుకు గతంలో సర్వే చేసి అనుకూలంగా ఉన్నట్లు తేల్చారు. అయినా అధికారులు పట్టించుకోకపోవడంతో పాలుట్ల గిరిజనులు తమ పొలాల్లో తవ్వుకున్న బావులకు డీజిల్ ఇంజిన్లను ఏర్పాటు చేసుకొని పంటలను సాగు చేసుకుంటున్నారు. దీంతో పంటలు సాగు చేసేందుకు పెట్టుబడి భారంగా మారుతుంది.

గతంలోనే దరఖాస్తు చేశాం

నిమ్మల ఈదన్న, రైతు, పాలుట్ల



జలసిరి పథకం కింద బోర్లు వేసి సోలార్ మోటార్లు బిగించాలని గతంలోనే ఉన్నతాదికారులకు వినతి పత్రం ఇచ్చాం. వారి నుంచి ఇప్పటి వరకూ ఎలాంటి స్పందన లేదు. భూములున్నా సాగునీరు లేక పంటలు సాగు చేయడం లేదు. లేదు. సోలార్ మోటార్లు వేస్తే వందల ఎకరాలు సాగులోకి వస్తుంది.

సోలార్ మోటార్లు బిగించాలి

రామావత్ బాలకృష్ణా నాయక్, పాలుట్ల



పంటలు సాగు చేసేందుకు డీజిల్ ఇంజన్లతో ఇబ్బందులు పడు తున్నాం. పెట్టుబడి భారంగా మారుతోంది. ప్రభుత్వం గతంలోనే సర్వే చేసింది. ప్రభుత్వం ముందుకొచ్చి సోలార్ మోటార్లు బిగిస్తే తమ భూములు సస్యశ్యామలం అవుతాయి, పంటలు బాగా పండించుకోగలుగుతాము.



పావురాలను ఎగురవేస్తున్న సిఐ వెంకటేశ్వర్లు

విద్యార్థి దశలో క్రీడలు అవసరం

ప్రజాశక్తి-మార్కాపురం

విద్యార్థి దశలో చదువుతో పాటు క్రీడలు అవసరమని మార్కాపురం సిఐ ఆవుల వెంకటేశ్వర్లు తెలిపారు. స్థానిక శ్రీసాయి బాలాజీ హైస్కూల్‌లో 'ఇంట్రామ్యూరల్స్ గేమ్స్ అండ్ స్పోర్ట్స్' మీట్‌ను సిఐ వెంకటేశ్వర్లు సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా సిఐ మాట్లాడుతూ క్రీడలతో మానసిక ఉల్లాసం కలుగుతుందన్నారు. ఇదే చదువులో కూడా రాణించేందుకు దోహదపడుతుందన్నారు. క్రీడలను ప్రోత్సహించాల్సిన అవసరం ఉందన్నారు. అనంతరం క్రికెట్, కబడ్డీ, క్యారమ్స్, ఖోఖో లాంటి ఆటల పోటీలు నిర్వహించారు. ఈ పోటీలు మంగళవారమకూ జరగనున్నాయి. ఈ పోటీల్లో విజేతలకు ఈ నెల 29న నేషనల్ స్పోర్ట్స్ డే సందర్భంగా బహుమతులు ప్రదానం చేస్తామని ఆ పాఠశాల ప్రిన్సిపల్ మస్తాన్‌వలి, డైరెక్టర్ పి.ప్రకాశరావు తెలిపారు.

రజతోత్సవ వేడుకల్లో ఎంపీ మాగుంట

ప్రజాశక్తి - ఒంగోలు కలెక్టరేట్

శ్రీకష్ణాష్టమి సందర్భంగా చెన్నైలోని మ్యూజిక్ అకాడమీ హాలులో శ్రీ కళా సుధ తెలుగు అసోసియేషన్ రజతోత్సవ వేడుకలు నిర్వహించారు. ఈ వేడుకల్లో ఒంగోలు ఎంపీ మాగుంట శ్రీనివాసులు రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎంపీ మాగుంట శ్రీనివాసులు రెడ్డిని అసోసియేషన్ సభ్యులు ఘనంగా సత్కరించి జ్ఞాపికను బహూకరించారు.

అసంపూర్తిగా భవన నిర్మాణం

ప్రజాశక్తి - సంతమాగులూరు : మండల పరిధిలోని ఏల్చూరు కస్తూరిబా గాంధీ బాలికల విద్యాలయంలో పేస్-2 నాడు - నేడు పథకం ద్వారా మంజూరైన అదనపు తరగతి గదుల నిర్మాణం అసంపూర్తిగా నిలిచిపోయింది. 6వ తరగతి నుంచి 10వ తరగతి వరకు పాఠశాలలో తరగతులు నిర్వహిస్తున్నారు. 190 మంది బాలికలు పాఠశాల్లో చదువుతున్నారు. గత ఏడాది నుంచి ఇంటర్మీడియట్ ప్రవేశపెట్టారు. 50మంది బాలికలు ఇంటర్ చదువుతున్నారు. తరగతి గదులు చాలక వరండాల లోనే అధ్యాపకులు తరగతులు నిర్వహిస్తున్నారు. దీన్ని దృష్టిలో పెట్టుకొని రెండేళ్ల క్రితం పాఠశాలను ఆనుకొని నాడు నేడు కింద జి ప్లస్ వన్ పద్ధతిలో 8 గదులను తల్లి, దండ్రుల కమిటీ భాగస్వామ్యంతో నిర్మాణం చేపట్టారు. రూ.26 లక్షల ఖర్చుతో భవనాలు స్లాబ్ నిర్మాణం పూర్తి చేశారు. అనంతరం పనులు నిలిచిపోయాయి. దీంతో భవనాల పిల్లర్ల ఇనుప చువ్వలు తుప్పుబటి శిథిలావస్థకు చేరాయి. ఇప్పటికైనా అధికారులు స్పందించి పాఠశాల భవన నిర్మాణాన్ని పూర్తి చేయాలని విద్యార్థుల తల్లిదండ్రులు కోరుతున్నారు.



వీల్‌చైర్ అందజేస్తున్న దాతలు

బాలుడికి వీల్ చైర్ అందజేత

ప్రజాశక్తి - ఒంగోలు కలెక్టరేట్

లయన్స్ క్లబ్ అఫ్ ఒంగోలు లెజెండరీ సిటిజన్స్ ఆధ్వర్యంలో వికలాంగ బాలుడికి వీల్ చైర్ అందజేశారు. మార్టూరు మండలం వలపర్ల గ్రామానికి చెందిన షేక్ దరియా సన్నతుల్లా(11) అనే బాలుడు ప్రమాదంలో నడుము నుంచి కింద భాగం చచ్చుబడి నడవడానికి ఇబ్బంది పడుతున్నాడు.వీల్ చైర్ కావాలని బాలుడు క్లబ్‌ని సంప్రదించాడు. క్లబ్ సభ్యులు ఆవుల అంకిరెడ్డి ఆర్థిక సహకారంతో ఒంగోలు సత్యనారాయణపురం ఆంధ్ర హైస్కూల్‌లో ఆ బాలుడికి క్లబ్ సభ్యులు సోమవారం వీల్ చైర్ అందజేశారు. ఈ సందర్భంగా ఒంగోలు నగర అభివద్ధి కమిటీ అధ్యక్షుడు మారెళ్ళ సుబ్బారావు మాట్లాడుతూ వరపర్ల గ్రామానికి చెందిన దరియా సన్నా తుల్లా తన తండ్రి తో కలిసి ఆటోలో వెళుతుండగా ప్రమాదానికి గురై నడుమువరకు వెన్నుపూస విరిగిపోయి కాళ్లు చచ్చుబడిపోయాయన్నారు. తల్లి రేష్మ ఇద్దరు బిడ్డలను చదివిస్తూ ఆర్థిక ఇబ్బందులతో వీల్ చైర్ లేక ఇబ్బందులు పడుతుంటే మానవత్వంతో క్లబ్ సభ్యులు వీల్ చైర్ అందించారన్నారు. పిల్లల చదువుకు ఆర్థికంగా అండగా ఉంటామని తెలిపారు. ఈ కార్యక్రమంలో క్లబ్ ప్రెసిడెంట్ అడపాల అయ్యప్ప, సెక్రటరీ తన్నీరు సోమయ్య, కోశాధికారి గ్రంధి చరణ్, రీజియన్ చైర్మన్ చిట్టెంరెడ్డి శ్రీనివాసరెడ్డి, ఫాస్ట్ ప్రెసిడెంట్ ఆడుసుమల్లి వెంకట్రావు, క్లబ్ ఫౌండర్ మంగళగిరి నరసింహారావు, ఆంధ్ర హై స్కూల్ కరస్పాండెంట్ బొమ్మల శ్రీనివాసరావు, సెయింట్ మేరీ స్కూల్ నోబెల్ చెరియన్ పాల్గొన్నారు.

అలరించిన కృష్ణాష్టమి వేడుకలు

ప్రజాశక్తి-మార్కాపురం

మార్కాపురం పట్టణం లోని గాంధీ బజారులోని 43వ అంగన్‌వాడీ కేంద్రంలో సోమవారం కృష్ణాష్టమి వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా చిన్నాలు శ్రీకృష్ణుడి, గోపికల వేష ధారణలో ఆకట్టుకున్నారు. అంగన్‌వాడీ కార్యకర్త పద్మావతి ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ వేడుకల్లో ఉట్టికొట్టే కార్యక్రమం హైలెట్‌గా నిలిచింది.



గోపికలో వేషధారణలో చిన్నారి



మార్కాపురంలో సందడి చేస్తున్న చిన్నారులు

ఒంగోలుసబర్బన్ :ఒంగోలు నగర పరిధిలోని కొప్పోలు గ్రామంలో శ్రీకృష్ణాష్టమి వేడుకలు ఘనంగా నిర్వహించారు.

ఈ సందర్భంగా స్థానిక కృష్ణమందిరంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. చిన్నారులు శ్రీకృష్ణుడు, గోపికల వేషధారణలో సందండి చేశారు. అనంతరం ఉట్టే కొట్టే కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

కులాల అంతరాలు తొలగించేందుకు కలిసి పనిచేద్దాం

సామాజిక సమరసత వేదిక జాతీయ కన్వీనర్ శ్యాంప్రసాద్

ప్రజాశక్తి-మార్కాపురం

చేసే వత్తిని బట్టి ఏర్పడిన కులాలను అందరూ గౌరవించాలని, కులాల మధ్య అంతరాన్ని తొలగించేందుకు మనమంతా కలిసి పనిచేయాలని సామాజిక సమరసత వేదిక జాతీయ కన్వీనర్ శ్యాంప్రసాద్ కోరారు. మార్కాపురం పట్టణంలోని బందావన్ అపార్ట్‌మెంట్ ప్రాంగణంలో సోమవారం సమావేశం నిర్వహించారు. ఈ



మాట్లాడుతున్న శ్యాంప్రసాద్

సందర్భంగా శ్యాంప్రసాద్ మాట్లాడారు. ఇంటి వరకే కులం గురించి మాట్లాడుకోవాలని, సమాజంలో అందరం సమానం అనే భావనను పెంపొందించు కోవాలన్నారు. సమాజంలో జరుగుతున్న పలు పరిణామాలను ఆయన ఈ సందర్భంగా వివరించారు. చాతుర్వర్ణ వ్యవస్థ ఎందుకు పుట్టింది? ఆ తర్వాత ఎలా రూపాంతరం చెందింది? ప్రస్తుతం సమాజంలో ఉన్న సామాజిక రుగ్మతల గురించి ఆయన వివరించారు. ఆలయాల్లో అన్ని వర్గాల వారికి ప్రవేశం ఉండేలా మనలాంటి వారు చొరవ తీసుకోవాలన్నారు. ప్రతి కుల పెద్ద తమ కులంలోని పేదలను గుర్తించి వారికి ఆర్థికంగా, విద్యా పరంగా, సామాజిక పరంగా సహకారం అందించాలని సూచించారు. అలా కులాలను సంఘటితం చేసుకోవడం, బలవర్ధకం చేసుకోవడం ద్వారా సమాజంలో మంచి గుర్తింపు పొందవచ్చునని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో సామాజిక సమరసత వేదిక నెల్లూరు ప్రతినిధి వేముల సుబ్బారావు, వివిధ కులాలకు చెందిన ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

శ్రీకృష్ణాష్టమి శుభాకాంక్షలు

ప్రజాశక్తి - ఇంకొల్లు


ఏలూరి సాంబశివరావు

శ్రీకృష్ణ జన్మాష్టమి పండుగ సందర్భంగా శాసన సభ్యులు ఏలూరి సాంబశివరావు ప్రజలకు శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ హిందూ సాంప్రదాయంలో పండుగలకు ప్రత్యేకత ఉందని అన్నారు. భగవద్గీతకు ప్రపంచ వ్యాప్తంగా ప్రత్యేకత ఉందని అన్నారు.


యడం బాలాజీతో మాట్లాడుతున్న కరణం వెంకటేష్

బాలాజీని కలిసిన కరణం వెంకటేష్

ప్రజాశక్తి - చీరాల

వైసీపీ పర్చూరు ఇన్చార్జి యడం బాలాజీ ఆహ్వానం మేరకు వైసీపీ చీరాల ఇంచార్జ్ కరణం వెంకటేష్ బాబు సోమవారం మర్యాద పూర్వకంగా కలిశారు. స్థానిక బాలాజీ క్యాంపు కార్యాలయంలో మున్సిపల్ చైర్మన్ జంజనం శ్రీనివాసరావుతో కలిసి అయన వెళ్లారు. ఎన్నికలు ముగిసిన అనంతరం ఇద్దరు కలసి కొద్దిసేపు సమావేశం అయ్యారు. ఈ సందర్భంగా రాజకీయ పరిణామాలపై, భవిష్యత్తు కార్యాచరణపై కొద్దిసేపు చర్చించారు.


త్రాగునీటి కుళాయిలను పరిశీలిస్తున్న అధికారులు

నీటి కుళాయిలు పరిశీలన

ప్రజాశక్తి - సంతమాగులూరు

మండలంలోని మక్కెన వారిపాలెంలో ఏడాది నుండి త్రాగునీటి పైపులైన్లు లీకులతో సరిగా సరఫరా కాకపోవడంతో ఆర్‌డబ్ల్యుఎస్ ఎఈ గిరి నాయక్, మాజీ జెడ్పిటిసి తేళ్ళ శ్రీనివాసరావు సోమవారం పరిశీలించారు. ఇప్పటి వరకు గ్రామంలో స్టోరేజ్ నుండి వచ్చే నీరు వృధాగా పోతూ ఉందని, ఇటీవల గ్రామానికి ఉపాధి హామీ గ్రామ సభకు వచ్చిన మంత్రి గొట్టిపాటి రవికుమార్ దృష్టికి తీసుకువచ్చారు. దీంతో మంత్రి స్పందించి వారంలోగా పైపులైన్లు మరమ్మత్తులు చేసి ప్రజలకు తాగునీటిని అందించాలని ఆదేశించారు. మంత్రి ఆదేశాలతో ఎఇ గిరి నాయక్ గ్రామంలో వృధాగా పోతున్న నీటి కుళాయిలను పరిశీలించారు. రెండు రోజుల్లో గ్రామంలోని అన్ని పైపులైన్లు మరమ్మత్తులు చేసి కుళాయిలు బిగించి త్రాగునీరు అందజేస్తామని తెలిపారు. కార్యక్రమంలో సర్పంచి దారా సుజాత, వార్డు సభ్యులు పాల్గొన్నారు.

తాతారావుకు ఘన నివాళి

ప్రజాశక్తి - కొల్లూరు


మృతదేహానికి నివాళు లర్పించిన మధుసూధన ప్రసాద్

మండలంలోని జువ్వలపాలెంకు చెందిన ఐడిపిఎల్ గ్రూప్ చైర్మన్, విఆర్‌కె చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ వేములపల్లి రవి కిరణ్ తండ్రి వేములపల్లి తాతారావు గృహం నం దు అనారోగ్యంతో మృతి చెందారు. ఆయన భౌతిక కాయాన్ని సందర్శించి తెలుగు యువత రాష్ట్ర అధికార ప్రతినిధి, మాజీ ఎంపీపీ డాక్టర్ కనగాల మధుసూదన్ ప్రసాద్ ఘనంగా నివాళి అర్పించారు. కార్యక్రమంలో తెలుగుదేశం నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.

వరికి నీరు ఇస్తామని ప్రకటించాలి

రైతు సంఘం జిల్లా నాయకులు డిమాండ్

ప్రజాశక్తి - పంగులూరు

నాగార్జున సాగర్ ప్రాజెక్టు కుడి కాలువ పరిధిలో ఆరుతడి పంటల సాగు చేసుకోమని ప్రభుత్వం చెప్పటం సరైంది కాదని, ఈ నిర్ణయం మార్చుకొని వరి సాగుకు నీళు ఇస్తామని ప్రభుత్వం వెంటనే ప్రకటన చేయాలని రైతు సంఘం జిల్లా నాయకులు డిమాండ్ చేశారు. కృష్ణా నది పరివాహక ప్రాంతంలోని ప్రాజెక్టులన్ని పూర్తిగా నిండిపోయి, నీరంతా సముద్రం పాలవుతుండగా ప్రభుత్వం ఇలాంటి ప్రకటన చేయటం సరైనది కాదని రైతు సంఘం జిల్లా కార్యదర్శి తలపనేని రామారావు, కందిమల్ల రామకోటేశ్వరరావు పేర్కొన్నారు. శ్రీశైలం, నాగార్జున సాగర్ ప్రాజెక్టులు ఈపాటికే నిండిపోయాయని, సాగునీరు, తాగునీటికి ఎలాంటి ఇబ్బంది ఉండబోదని రైతాంగం భావిస్తున్న తరుణంలో ప్రస్తుత ప్రభుత్వ ప్రకటన రైతాంగాన్ని నిరాశకు గురిచేసిందని తెలిపారు. 2004లో


రైతు సంఘం జిల్లా నాయకులు తలపనేని, కందిమల్ల

నాగార్జున సాగర్‌లో 540 అడుగుల నీటిమట్టం ఉన్నప్పుడే రైతాంగ ఉద్యమం ద్వారా ప్రభుత్వ మెడలు వంచి మగాణికి సాగునీరు సాధించామని, మాగాణి సాగుకు అప్పటి ప్రభుత్వం నీళ్లు ఇచ్చిందని గుర్తు చేశారు. ప్రస్తుతం ప్రాజెక్టు నిండా నీళ్లున్నా ఆరుతడి పంటలకే సాగునీరు ఇస్తామనటం సరైంది కాదన్నారు. గతేడాది నీరు లేక మాగాని సాగు తగ్గటం వలన ఈ ఏడాది ధాన్యం రేట్లు, బియ్యం రేట్లు విపరీతంగా పెరిగాయని అన్నారు. పశువులకు మేత కూడా లేకుండా పోయిందని అన్నారు. జిల్లాలోని నాగార్జునసాగర్ కాలువల కింద మాగాణి 72,822-37 ఎకరాలు, ఆరుదడి కింద 1,02,636-52 ఎకరాలు మొత్తం 1,74,918-89 ఎకరాలు సాగవుతుందని చెప్పారు. అయితే ఈ ఏడాది మాగాణి సాగుకు నీరివ్వకపోతే మాగాణి విస్తీర్ణం పడిపోతుందని చెప్పారు. గతంలో పులిచింతల, పట్టిసీమ ప్రాజెక్టుల నుండి నీళ్లు పుష్కలంగా ఉన్నప్పటికీ సాగర్ కుడికాలువ పరిధిలో ఆరుతడి పంటలకే సాగునీరంటూ ప్రకటన చేయటం సరైనది కాదని చెప్పారు. ప్రభుత్వం వెంటనే సరి చేసుకొని మాగాణి సాగుకు అనుకూలంగా ప్రకటన చేయాలని, లేకుంటే రైతాంగాన్ని సమీకరించి ఉద్యమాన్ని నిర్మిస్తామని తెలిపారు.

తొలగించిన రోడ్డు స్థానంలో మరోసారి నిర్మాణం


పోలీసులకు ఫిర్యాదు చేస్తున్న యన్నం సురేష్

ప్రజాశక్తి - భట్టిప్రోలు

మండలంలోని పెసర్లంక గ్రామంలో యన్నం సురేష్‌కు చెందిన పంట పొలంలో నిర్మించిన రహదారి వివాదం కొనసాగుతూనే ఉంది. ఎస్సీ కమిషన్ ఆదేశాల మేరకు రెవెన్యూ సిబ్బంది తొలగించిన రోడ్డును మరోసారి రైతులు సురేష్ భూమిలో ఆదివారం మరోసారి నిర్మించారు. గతంలో రైతులు వేసిన రోడ్డును రెవెన్యూ అధికారులు మొన్ననే వచ్చి తొలగించారు. మరల రోడ్డు ఎందుకు వేస్తున్నారని అడిగిన తమ తండ్రి కొడుకులను కొట్టి కులం పేరుతో దూషించి మరణాయుధాలతో భయభ్రాంతులకు గురిచేశారని సురేష్ ఆరోపించారు. దీంతో స్థానిక పోలీసు స్టేషన్‌లో సురేష్ సోమవారం ఫిర్యాదు చేశారు. జూన్ 18న తన పొలంలో అగ్రకులానికి చెందిన దేవ భక్తుని వినోద సాయి, అతని అనుచరులతో తన పొలం గుండా దౌర్జన్యంగా రోడ్డు ఏర్పాటు చేశారని సురేష్ తెలిపారు. అప్పట్లో పోలీసు, రెవెన్యూ అధికారులకు తాను విన్నపించుకున్నప్పటికీ ఫలితం లేకపోవడంతో ఎస్సీ కమిషన్ చైర్మన్‌ను ఆశ్రయించినట్లు తెలిపారు. తక్షణమే స్పందించిన చైర్మన్ తన పొలం వద్దకు వచ్చి పరిశీలించి రోడ్డు తొలగించాలని రెవెన్యూ, పోలీసు అధికారులకు ఆదేశాలు జారీ చేశారని గుర్తు చేశారు. దీంతో తన పొలం గుండా వేసిన రోడ్డును తొలగించి నిందితులపై కేసు నమోదు చేసి, రోడ్డు తొలగించిన ఫోటోలను, కేసు నమోదు చేసిన ఎఫ్ఐఆర్‌ను ఎస్సీ కమిషన్ ఆఫీసుకు పంపించాలని అప్పటి ఆదేశాల్లో పేర్కొన్నట్లు తెలిపారు. దీంతో అధికారులు ఈ నెల 18న రోడ్డు తొలగించి 21న నిందితులపై పోలీసు స్టేషన్లో కేసు నమోదు చేశారని తెలిపారు. 25న ఆదివారం వినోద్ సాయి తన అనుచరులతో అక్రమంగా ఎస్సీ కమిషన్ ఆదేశాలు ఉన్నప్పటికీ రోడ్డు వేశారని ఆందోళన వ్యక్తం చేశారు. తమ పొలంలో రోడ్డు వేసే సమయంలో పోలీసులు, రెవెన్యూ అధికారులకు ఫోను ద్వారా సమాచారం ఇచ్చి రోడ్డు వేస్తున్నారని చెప్పినప్పటికీ పట్టించుకోకపోవడంపై పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేస్తున్నట్లు సురేష్ సోమవారం తెలిపారు. ఇప్పటికైనా పోలీసు, రెవెన్యూ అధికారులు స్పందించి తమ పొలం గుండా అక్రమంగా నిర్మించిన రోడ్డు తొలగించి తమ భూమిని తమకు అప్పగించాలని, తన కుటుంబ సభ్యులకు ప్రాణ రక్షణ కల్పించి న్యాయం చేయాలని ఫిర్యాదులో పేర్కొన్నారు.


తొలగించిన ప్రాంతంలో మరోమారు నిర్మించిన రోడ్డు

ఉపాధ్యాయుడికి మదర్ థెరిసా జాతీయ అవార్డు

ప్రజాశక్తి - చెరుకుపల్లి

మండలంలోని ఆరేపల్లి ఎంపీయూపీ స్కూల్ ఉపాధ్యాయులు మరదాపు కోటేశ్వరరావు మదర్ థెరీసా జాతీయ అవార్డును అందుకున్నారు. అంతర్జాతీయ గుర్తింపు పొందిన విజయవాడకు చెందిన మదర్ సర్వీస్ సొసైటీ స్వచ్ఛంద సేవా సంస్థ ద్వితీయ వార్షికోత్సవం సందర్భంగా విజయవాడలో నిర్వహించిన జాతీయ అవార్డుల ప్రధానోత్సవంలో సమాజ సేవకు అంకితమై వివిధ రంగాల్లో స్వచ్ఛంద సేవలు చేస్తున్న వారిని ప్రోత్సహిస్తూ విజయవాడ గాంధీనగర్ హనుమంతరాయ గ్రంథాలయంలో సోమవారం ఏర్పాటు చేసిన అవార్డుల ప్రధాన ఉత్సవంలో జాతీయ అవార్డును అందజేశారు. సంస్థ ఆర్గనైజర్ మల్లాది ప్రసాదరావు, కెఎస్ జవహార్ తన చేతుల మీదుగా అవార్డు అందజేశారు. అవార్డు అందుకున్న ఉపాధ్యాయుడిని ఎంఇఒలు పులి లాజర్, టి నవీన్ కుమార్, పాఠశాల హెచ్ఎం కాటూరి నాగేశ్వరరావు, యుటీఎఫ్ సీనియర్ నాయకులు బాదావత్ సాంబయ్య నాయక్ అభినందించారు.



మదర్ థెరీసా అవార్డు అందుకున్న మరదాపు కోటేశ్వరరావు


విద్యార్థులకు పుస్తకాలు అందిస్తున్న దీపాల ప్రసాద్

పుస్తకాల పంపిణీ

ప్రజాశక్తి - భట్టిప్రోలు

మార్కండేయ పద్మశాలి సఘం ఆధ్వర్యంలో గ్రామంలోని కుమ్మరకుంట వారివీధిలోని రామ మందిరం వద్ద చేనేత కార్మిక కుటుంబాలకు చెందిన విద్యార్థులకు ఉచితంగా పుస్తకాలు సోమవారం అందజేశారు. సంఘ అధ్యక్షులు మట్టి మల్లికార్జునరావు ఆధ్వర్యంలో సంఘ సభ్యులు, న్యాయవాది దీపాల శివప్రసాద్ చేతుల మీదగా అందించారు. విద్యార్థులకు ఉచితంగా అందిస్తున్న పుస్తకాలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. పద్మశాలియ సంఘం చేనేత కార్మికుల అభ్యున్నతికి కృషి చేస్తుందని పేర్కొన్నారు. కార్యక్రమంలో సంఘ గౌరవ అధ్యక్షులు సంఘపు శరత్ చంద్రబోస్, కౌతరపు శ్రీనివాసరావు, బట్టు రామకృష్ణ, జక్కా బాల వెంకట సాయి, పోలన హేమ కుమార్ పాల్గొన్నారు.

పేకాట శిబిరంపై పోలీసుల దాడి

ప్రజాశక్తి - వేటపాలెం

మండలంలోని చల్లారెడ్డిపాలెం పంచాయితీ కటారిపాలెంలో పేకాట శిబిరంపై పోలీసులు సోమవారం దాడి చేశారు. పేకాట ఆడుతున్న 14 మందిని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. వారి వద్ద నుండి రూ.11,100 నగదు స్వాధీనం చేసుకున్నారు. ఈ సందర్భంగా ఎస్ఐ మీసాల వెంకటేశ్వర్లు మాట్లాడుతూ అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడుతున్న వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. నిరంతరం పోలీసుల నిఘా ఉంటుందని అన్నారు. అసాంఘిక ఘటనల సమాచారం ఇవ్వాలని చెప్పారు. సమాచారం చెప్పిన వారి పేర్లు గోప్యంగా ఉంచుతామని అన్నారు.


జూదరులను అదుపులోకి తీసుకున్న ఎస్ఐ ఎం వెంకటేశ్వర్లు

ఇస్లాంపేటలో శ్రీకృష్ణాష్టమి వేడుకలు

ప్రజాశక్తి - ఇంకొల్లు

స్థానిక కృష్ణనగర్‌లోని కృష్ణ మందిరం నందు, ఇస్లాంపేటలో శ్రీకృష్ణాష్టమి వేడుకలు కృష్ణ మందిరం నిర్వాహకులు మాజేటి మల్లికార్జునరావు ఆధ్వర్యంలో చిన్నారులకు కృష్ణ వేషాదరణ, గోపిక వేషాధరణలో సందడి చేశారు. ఉట్టి కొట్టే కార్యక్రమాన్ని నిర్వహించారు.

ఆ రోడ్డులో ప్రయాణం ప్రాణ సంకటం

ప్రజాశక్తి - భట్టిప్రోలు

వెల్లటూరి నుండి పేనుముడి వరకు వెళ్లే రహదారి పూర్తిగా ధ్వసంది. పెద్ద, పెద్ద గుంతలు ఏర్పడ్డాయి. ఆ రోడ్డులో ప్రయాణం ప్రాణ సంకటంగా మారింది. గత పదేళ్ల క్రితం క్రితం ఈ రహదారికి అప్పటి టిడిపి ప్రభుత్వం గుంటల మరమ్మతులు చేపట్టి అప్పట్లో అభివృద్ధి చేసింది. ఐదేళ్లుగా ఎలాంటి మరమ్మతులకు ఈ రోడ్డు నోచుకో లేదు. దీంతో రహదారి పూర్తిగా దెబ్బతిని పెద్ద పెద్ద గుంటలు ఏర్పడ్డాయి. ఈ రోడ్డులో వాహన చోదకులు ప్రయాణించాలంటే భయభ్రాంతులకు గురవుతున్నారు. ఈ రోడ్డు తెనాలి నుండి పెనుమూడి వారధి మీదగా కృష్ణా జిల్లాకు రాకపోకలు సాగిస్తూ ఉంటారు. పెనుమూడి నుండి వెల్లటూరు వరకు ఆటోల్లో నిత్యం ప్రయాణికులను చేరవేస్తూ ఉంటారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్లో రేపల్లె శాసన సభ్యులుగా ఉన్న దేవినేని మల్లికార్జునరావు సింగల్ రహదారిగా ఉన్న పెనుమూడి - వెల్లటూరు రహదారిని



వెల్లటూరు - పెనుమూడి రహదారిలో ఏర్పడ్డ గుంటలు

డబల్ లైన్ రోడ్డుగా నిర్మాణం చేపట్టి అభివృద్ధి చేశారు. అనంతరం మరో ఐదేళ్లపాటు ఈ రహదారిలో ఎక్కడ గుంట ఏర్పడిన అప్పటికప్పుడే మరమతులు చేపట్టి గుంటలు పూడ్చి ఇబ్బంది లేకుండా చేసేవాళ్లు. గత వైసిపి ప్రభుత్వం అధికారం చేపట్టినప్పటి నుండి రహదారుల అభివృద్ధిపై దృష్టి పెట్టలేదు. దీంతో ఈ రహదారిలో వాహనాల రద్దీకి చిత్రమై గుంటలు ఏర్పడ్డాయి. పెనుమూడి నుండి భట్టిప్రోలు, చెరుకుపల్లి, గుంటూరు వైపు వెళ్లేందుకు గతంలో ఇదే రహదారిని ప్రయాణకుల వినియోగించుకునేవారు. ప్రస్తుతం 216 జాతీయ నిర్మాణంతో ఈ ప్రాంతాలకు వెళ్లే ప్రజలంతా జాతీయ రహదారిపై ప్రయాణిస్తున్నారు. దీని కారణంగా వెల్లటూరు, పెనుమూడి రహదారికి కొంత ట్రాఫిక్ తగ్గినప్పటికీ తెనాలి నుండి పెనుమూడి మీదుగా కృష్ణా జిల్లాకు వెళ్లే వాహనదారులకు మాత్రం ఇదే ప్రధాన రహదారి కావడంతో వీరంతా గుంటలు పడిన రహదారినే వినియోగించక తప్పడం లేదని వాపోతున్నారు. దీని కారణంగా ప్రయాణానికి అధిక సమయం వెచ్చించాల్సి వస్తుందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. నూతన కూటమి ప్రభుత్వ పాలనలోనైనా రహదారిపై దృష్టి సాధించి అభివృద్ధి చేయాలని ప్రయాణికులు, వాహన చోదకులు కోరుతున్నారు.

అవధానంలో అందెవేసిన 'నారాయణం'

ప్రజాశక్తి - అద్దంకి

సాహితీ మిత్ర మండలి ఆధ్వర్యాన పుట్టంరాజు బుల్లెయ్య, రామలక్ష్మమ్మ ఛారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో జరిగిన అవధాన పురస్కార సభకు డాక్టర్ యు దేవపాలన అధ్యక్షత వహించారు. అవధానం ఒక పద్యక్రీడని, అందులో ఆరితేరిన అవధాని నారాయణం వారని అన్నారు. ఆయన పుంభావ సరస్వతని పేర్కొన్నారు. ట్రస్టు తరపున శతావధానం నిర్వహించిన శ్రీరామ చంద్రమూర్తి మాట్లాడుతూ ఆశుకవిత్వ గరిమ, సాహితీ పటిమ, ధారణాశక్తి, పాండిత్య ప్రకర్షకు అత్యున్నతమైన పరీక్ష అవధానమని అన్నారు. అవధాన అంశాలకు ఆశువుగా, చమత్కార భరితంగా పూరణలు చేయడంలో, సరస సంభాషణలు, చతురోక్తులతో అవధాన ప్రక్రియ నడపడంలో నారాయణం సిద్ధహస్తుడని అన్నారు. నారాయణం బాలసుబ్రహ్మణ్యం ప్రతిభావ్యుత్పత్తులను ప్రశంసించారు. ఆశువుగా పద్యం చెప్పడం, మంచి ధారతో పద్యం నడపడం, గొప్ప ధారణతో అవధానాన్ని సంపూర్ణం చేయగల సత్తా నారాయణంకు ఉందని అన్నారు. పద్యం పుట్టిన గడ్డపై నాల్గవ శతావధానాన్ని సాహితీ మిత్ర మండలి నిర్వహించడం అదృష్టంగా భావించవచ్చని సంచాలకులు పోలూరి వెంకటశివరామ ప్రసాదు అన్నారు.



నారాయణం బాలసుబ్రమణ్యంను సత్కరిస్తున్న దృశ్యం

డాక్టర్ తాళ్ళూరి ఆంజనేయులు శిష్యుడు శతావధానికి సంపూర్ణ ఆశీస్సులు అందించారు. సాదాసీదాగా కనిపించే నారాయణం అవధాన సమయంలో పుంభావ సరస్వతియై అక్షరాన్ని నర్తింప చేస్తారని అన్నారు. పదాలను పద్యపాదాలుగా పల్లవింపజేస్తూ పద్యామృతధార కురిపిస్తారని అవధాని పాండిత్య ప్రతిభను కొనియాడారు. పృచ్ఛకులడిగిన ప్రశ్నల శరాలను పూలమాలగా స్వీకరించి సమయోచితంగా, చమత్కార భరితంగా సమాధానాలు పద్య రూపంలో చెప్పి ఆహూతుల హృదయాలను రసప్లావితం చేసే శక్తి, యుక్తి నారాయణంకు కలదని కొనియాడారు. పుట్టంరాజు శ్రీరామచంద్రమూర్తి, శైలజ దంపతులు 350 అష్టావధానాలు, నాలుగు శతావధానాలు జన రంజకంగా చేసి పండిత ప్రకాండులచేత సెహభాష్ అనిపించుకున్న అవధాని నారాయణం పద్య విద్యకు పెద్దపీట వేసిన అద్దంకిలో పురస్కారద్రవ్యం రూ.10వేలు అందించి ఘనంగా సత్కరించారు. సన్మాన పత్రంను ప్రముఖ నటుడు వారణాసి రఘురామశర్మ, చుండూరి మురళీసుధాకరరావు అందించారు. కార్యక్రమంలో గాడేపల్లి దివాకర దత్తు, పాలపర్తి జ్యోతిష్మతి, డివిఎం సత్యనారాయణ, ఇలపావులూరి శేషశ్రీధరశర్మ, మానేపల్లినాగకుమారశర్మ, ఎం కృష్ణ కిషోర్, ఐలవరం వీరాంజనేయులు, దుర్భా కౌండిన్య శాయి, చివుకుల వెంకటా చలపతి, మద్దాలి శ్రీనివాస్, కార్యదర్శి కెవి పోలిరెడ్డి, చప్పిడి వీరయ్య, వెంకటేశ్వర్లు, ఇలపావులూరి శేష తల్పశాయి, ఓరుగంటి ప్రసాదరావు, లక్కరాజు విశ్వమోహన్, ఓరుగంటి శ్రీనివాసరావు, మిట్టా కామేశ్వరశర్మ, అద్దంకి లెవీప్రసాదు, సందిరెడ్డి శ్రీనివాసరావు, కంఠంరాజు శివరామ కోటేశ్వరరావు, కోలలపూడి శ్రీనివాస రావు, వఠ్యం సీతారామశాస్త్రి, పిఎల్వి నర్సింహారావు, గోపినాథం హరనాథ్, కూరపాటి రామకోటేశ్వరరావు పాల్గొన్నారు.



నీరు లేక ఎండిపోయిన బలిజేపల్లి చెరువు

ఎండిపోయిన బలిజేపల్లి చెరువు

ప్రజాశక్తి - వేమూరు

ప్రక్క వర్షాలు కురిసి వరదలు వస్తున్నప్పటికీ డెల్టా ప్రాంతంలో ఇప్పటి వరకు సరైన వర్షం లేక పోవడంతో ఖరీఫ్ సీజన్లో సాగు చేసిన వెద పైరులు నీరు లేక ఎండిపోతున్నాయి. ఆగస్టు నెల పూర్తి కావస్తున్నప్పటికీ మండలంలోని బలిజేపల్లి చెరువులో మాత్రం చుక్క నీరు లేక ఎండిపోయి పశువుల మేతకు ఆసరాగా మారింది. ఓపక్క వర్షాలు లేకపోవడం, మరోపక్క సాగునీరు సకాలంలో అందక పోవడమే ప్రధాన కారణమని గ్రామస్తులు వాపోతున్నారు. పంచాయతీకి చెందిన 5ఎకరాలకు పైగా ఉన్న చెరువు గ్రామానికి అత్యంత ప్రధానమైనది. పంచాయతీకి చాపల పాట ద్వారా ఆదాయాన్ని సమకూర్చటమే గాక రైతులు తమ పశువులను కడుక్కోవటానికి, ఇతరిత అవసరాలకు ఉపయోగిస్తుంటారు. ఎన్నడూ లేని విధంగా ఈ ఏడాది ఆగస్టు నెలాఖరుకు కూడా చెరువులో చుక్క నీరు లేకపోవడం గ్రామస్తులను ఆందోళనకు గురిచేస్తుంది. గత రెండు నెలలుగా కనీసం వర్షం లేదు. నిత్యం ఓ మోస్తరు చినుకులకు పరిమితమైన వర్షాభావ పరిస్థితి ఈ చెరువును చూస్తే అర్థమవుతుంది. వాతావరణ పరిస్థితి ఇదే రీతిలో కొనసాగితే పూర్తిస్థాయిలో భారీ వర్షాలు పడితే తప్ప చెరువుకు నీళ్ల వచ్చే పరిస్థితి లేదని గ్రామస్థులు చెబుతున్నారు.

అనాథలకు అండగా సహృదయ సేవలు

ప్రజాశక్తి - వేమూరు

అనాథలను అక్కున చేర్చుకొని, వారికి సపర్యలు చేపట్టి ఆశ్రమంలో చేర్పించేవరకు సహృదయ సేవా సంస్థ సభ్యులు కృషి చేస్తున్నారు. సేవా సంస్థ అధ్యక్షులు రవీంద్రబాబు ఈపాటికే రహదారుల వెంట తిండి లేని అనేక మంది అనాథలను తన వంతు కృషితో ఆశ్రమంలో చేర్పిస్తూ ఉంటారు. దీనిలో భాగంగా సహృదయ సేవా సంఘం సభ్యుడైన పచ్చల కోటేశ్వరరావు ద్వారా గుంటూరులోని సెయింట్ జోసెఫ్ హాస్పిటల్ ఎదురుగల డివైడర్కు ఆనుకొని నిద్రిస్తున్న ఒక వృద్ధుడు కదలని స్థితిలో ఉన్నట్లు సమాచారం తెలుసుకొని స్పందించారు. అక్కడికి వెళ్లి పరిశీలించారు. అతన్ని పలకరించే ప్రయత్నం చేయగా ఏమాత్రం స్పందించలేదు. కంటి చూపు లేదు. మాట్లాడే శక్తి లేదు. శంకర్ విలాస్ బ్రిడ్జి డౌన్లో అతను ప్రమాదకరమైన పరిస్థితుల్లో ఉండుటంతో ఏ క్షణంలోనైనా అతని మీద వాహనాలు వెళ్లే అవకాశం ఉంది. ఈ పరిస్థితిని మదర్ తెరిసా సిస్టర్స్కు తెలియజేశారు. అతనిని ఆశ్రమానికి తీసుకురమ్మని కోరారు. దీంతో తను పోలీసులకు ఫోను ద్వారా అతని దినస్థితి వివరించి పోలీసుల సహకారంతో ఆశ్రమానికి తరలించినట్లు తెలిపారు. 2013 నుండి ఇప్పటి వరకు 250మందిని ఆశ్రమంలో చేర్పించినట్లు రవీంద్రబాబు తెలిపారు. మానవతా దృక్పథంతో అనాథలకు సౌకర్యాలు ఏర్పాటు చేసి ఆశ్రమంలో



వృద్ధుడిని ఆశ్రమంలో చేర్పిస్తున్న సభ్యులు

చేర్పించి సంతృప్తి చెందుతున్నట్లు చెప్పారు. ఉమ్మడి గుంటూరు జిల్లాలో వేమూరు, భట్టిప్రోలు, తెనాలి, గుంటూరు ప్రాంతాల్లో తన దృష్టికి వచ్చిన అనేక మందికి తన సంస్థ ద్వారా సేవా కార్యక్రమాలు చేపడుతున్నట్లు తెలిపారు.



ఎపిపియుఎస్ఎంఎ నూతన కమిటీ సభ్యులు

అపుస్మా అధ్యక్ష, కార్యదర్శులుగా విజయభాస్కర్, ఎంవి

ప్రజాశక్తి - చీరాల

ఆంధ్రప్రదేశ్ ప్రైవేట్ యునైటెడ్ స్కూల్స్ మేనేజ్మెంట్ అసోసియేషన్ జిల్లా నూతన కార్యవర్గ ఎన్నిక స్థానిక రోటరీ క్లబ్ ఆవరణలో సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా నూతన కార్యవర్గం ఎన్నుకున్నారు. జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులుగా ఇంకొల్లు ఆదర్శ పాఠశాల డైరెక్టర్ తోటకూర విజయ భాస్కర్, చీరాల శ్రీ గౌతమి స్కూల్ డైరెక్టర్ ఎం వెంకటేశ్వర్లు (ఎంవి) ఎన్నికయ్యారు. వైస్ ప్రెసిడెంట్ అద్దంకి మన బాల భారతి పాఠశాల డైరెక్టర్ ఓ అంజిరెడ్డి, జనరల్ సెక్రెటరీ రేపల్లె రెయిన్బో పాఠశాల డైరెక్టర్ ఎస్ రవిశంకర్, జాయింట్ సెక్రటరీ అద్దంకి మహాత్మా గాంధీ పాఠశాల డైరెక్టర్ జి బ్రహ్మం, ట్రెజరర్ భట్టిప్రోలు సిద్ధార్థ పాఠశాల డైరెక్టర్ వి నాగేశ్వరరావు, ఈసీ సభ్యులు రేపల్లె బాల భారతి ఇంగ్లీష్ మీడియం పాఠశాల డైరెక్టర్ హేయగ్రీవా చారి, చీరాల ఈపురుపాలెం గీతాంజలి పాఠశాల డైరెక్టర్ యు రామకృష్ణ ఎన్నికైనట్లు తెలిపారు. కార్యక్రమంలో జిల్లాలోని వివిధ ప్రైవేటు పాఠశాలల డైరెక్టర్లు, యాజమాన్యాలు పాల్గొన్నారు.



ఇంకొల్లులో ఎండు ముఖం పట్టిన పశుగ్రాసం

ఎండు ముఖం పడుతున్న పశుగ్రాసం

ప్రజాశక్తి - ఇంకొల్లు

రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల్లో వర్షం విస్తృతంగా కురిసి వరదలతో వాగులు, వంకలు పొంగి, పొర్లుతున్నప్పటికీ పర్చూరు నియోజకవర్గంలో మాత్రం నేటికీ అత్యల్ప వర్షమే నమోదైనది. దీంతో ఖరీఫ్ పంటగా సాగు చేసిన వివిధ పైర్లకు భూమిలో సరిపడా తేమలేక ఎండు ముఖం పడుతున్నాయి. మండలంలోని ఇంకొల్లు, పావులూరు, నాగళ్ళ, నక్కలపాలెం ప్రాంతాల్లో మొక్కజొన్న సాగు చేశారు. పశుగ్రాసం కొరకు పచ్చజొన్న విత్తనాలు ఎదబెట్టారు. ప్రత్తి పంట కూడా స్వల్పంగా సాగు చేశారు. వర్షాలు తక్కువగా ఉండటంతో ఖరీఫ్ సాగు స్వల్పంగానే చేపట్టారు. వేసిన పంటలు కూడా సక్రమంగా వర్షాలు కురవక, నేలలో తేమ సరిపడు నంతలేక ఎండు ముఖం పడుతున్నాయి. జొన్న, మొక్కజొన్న పంటలు విచ్చి దాదాపు 35 నుంచి 45 రోజులు కావస్తుంది. వీటికి సరిపడా నీళ్ల లేక ఎదగకుండా ఎండు ముఖం పడుతూ రోజు రోజుకు కుషించుకుపోతున్నాయి. దీంతో రైతులు నిరాశతో ఉన్నారు.

సోలార్ కాపర్ తీగలు చోరీ

ప్రజాశక్తి - మార్టూరు రూరల్

పంట చేలలో వ్యవసాయ అవసరాల నిమిత్తం బిగించిన విద్యుత్ సోలార్ ప్లేట్ల వైర్లను గుర్తు తెలియని దుండగులు దొంగలించిన ఘటన ఇసుక దర్శి పాండు రంగస్వామి దేవాలయం సమీపంలో సోమవారం వెలుగు చూసింది. బాధిత రైతుల కథనం ప్రకారం ఇసుక దర్శి గ్రామానికి చెందిన యల్లల చెరువు సుబ్బారావు, కామేపల్లి సురేంద్ర, మారెళ్ల సుబ్బారావు, కల్లూరి సుబ్బారావు, కాకర్ల రామాంజనేయులు అనే రైతులు దర్శి, వలపర్ల గ్రామాల పరిధిలో తమ పొలాల్లో నీటి అవసరాల కోసం సోలార్ విద్యుత్ ప్లేట్లను బిగించి వాడుకుంటున్నారు. యధావిధిగా తమ పొలాలకు వెళ్లి సోమవారం పరిశీలించగా రూ.20వేల విలువైన విద్యుత్ వైర్లు చోరీకి గురైనట్లు గుర్తించారు. వెంటనే సీఐ శేషగిరిరావుకు ఫిర్యాదు చేశారు. గతంలో కూడా పలు సార్లు తమ పొలాల్లో సోలార్ ప్లేట్లకు బిగించిన విద్యుత్ వైర్లు చోరీకి గురైనట్లు రైతులు వాపోయారు. పోలీసులు చర్యలు తీసుకొని తమకు న్యాయం చేయాలని కోరారు.

నో బ్యాగ్ డే అమలు జరిగేలా చర్యలు

ప్రజాశక్తి కథనానికి స్పందన

ప్రజాశక్తి-యర్రగొండపాలెం
'విద్యార్థులకు పుస్తకాల మోత అనే శీర్షికతో ప్రజాశక్తి దినపత్రికలో ఈ నెల 25న ఓ కథనం ప్రచురితమైంది. ఈ కథనానికి జిల్లా విద్యాశాఖాధికారి డి సుభద్ర స్పందించారు. విద్యార్థులలో భాషా, నైపుణ్యం, పఠన నైపుణ్యం, శృజనాత్మక నైపుణ్యం, ఆరోగ్యం మరియు మానసిక వికాసం పెపొందించడానికి విద్యార్థి సర్వతో ముఖాభివృద్ధి కోసం ప్రతినెలా మొదటి, మూడో శనివారం నో బ్యాగ్ డే నిర్వహించేలా అన్ని మేనేజ్‌మెంట్లకు ఆదేశాలు జారీ చేసినట్లు ఆమె తెలిపారు. మండల విద్యాధికారులు, ఉప విద్యాధికారులు ఈ కార్యక్రమాన్ని తప్పకుండా అమలు జరిపేలా చర్యలు తీసుకుంటామని ఆమె తెలిపారు.

'వాగ్దేవి'లో ఫ్రెషర్స్ డే వేడుకలు



ఎస్ఐను సన్మానిస్తున్న ఉపాధ్యాయులు

ప్రజాశక్తి-మార్కాపురం
మార్కాపురం పట్టణం లోని వాగ్దేవి జూనియర్ కళాశాలలో ఫ్రెషర్స్ డే వేడుకలు సోమవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మార్కాపురం పట్టణ ఎస్ఐ సైదుబాబు మాట్లాడుతూ సచ్ఛీలత, సత్ ప్రవర్తనలతో కూడిన విద్య సమాజాన్ని మార్చగలదని తెలిపారు. ట్రైనీ ఎస్ఐ డాక్టర్ ఎన్, రాజమోహన్‌రావు మాట్లాడుతూ విద్య యొక్క ప్రయోజనం ఉపాధి కాదని, అది వ్యక్తికి మెరుగైన జీవన విధానాన్ని ఏర్పరచడంలో ఉపకరిస్తుందని తెలిపారు. కళాశాల ప్రిన్సిపల్ అడుగుల మోహన్ మాట్లాడుతూ సంస్కారంతో కూడిన విద్య ఎక్కడైనా రాణిస్తుందనీ, మనిషికి మాటే నిజమైన అలంకరాన్ని ఇస్తుందని చెప్పారు. గొబ్బూరు ఎంపిపి పాఠశాల ప్రధానోపాధ్యాయులు పోతిరెడ్డి బాలరంగారెడ్డి మాట్లాడుతూ యువత వారి జీవితంలో శ్రమ తత్వాన్ని పెంపొందించుకోవాలన్నారు. తల్లిదండ్రుల మనసు తెలుసుకుని వారిని ఆనందపరిచే బాధ్యత పిల్లలదేనని గుర్తు చేశారు. అనంతరం విద్యార్థులు సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. ఈ కార్యక్రమంలో కళాశాల చైర్మన్ గొలమారి శివారెడ్డి, డైరెక్టర్లు కె.శ్రీనివాసరావు, గొలమారి కళ్యాణ్‌రెడ్డి, పోతిరెడ్డి రవికుమార్‌రెడ్డి, విద్యార్థులు పాల్గొన్నారు.

రాజకీయాల్లో కష్టపడి ఎదిగిన వ్యక్తి డేవిడ్ రాజు

- మంత్రి డాక్టర్ స్వామి
- నివాళులర్పించిన సిపిఎం నేతలు


నివాళులర్పిస్తున్న సిపిఎం నేతలు

ప్రజాశక్తి - ఒంగోలు కలెక్టరేట్
రాజకీయాల్లో కష్టపడి ఎదిగిన వ్యక్తి మాజీ ఎమ్మెల్యే డేవిడ్ రాజు అని, ఆయన మతి బాధాకరమని రాష్ట్ర సాంఘిక సంక్షేమం, వికలాంగులు, వయోవృద్ధులు, సచివాలయాల శాఖ మంత్రి డాక్టర్ డోలా శ్రీ బాల వీరాంజనేయ స్వామి తెలిపారు. ఒంగోలు క్లోపేటలో రెండవ లైన్‌లోని డేవిడ్ రాజు స్వగహంలో ఆయన పార్థివ దేహానికి మంత్రి బాల వీరాంజనేయ స్వామి, యర్రగొండపాలెం టిడిపి ఇన్‌ఛార్జి గూడూరి ఎరిక్షన్ బాబు నివాళులర్పించారు. అనంతరం మంత్రి స్వామి మాట్లాడుతూ డేవిడ్ రాజు ఎంపిపి స్థాయి నుంచి కష్టపడి ఎదిగారన్నారు. జడ్పీ చైర్మన్ గా ప్రకాశం జిల్లా అభివద్ధి కషి చేశారన్నారు, సంతనూతలపాడు, యర్రగొండపాలెం ఎమ్మెల్యేగా ప్రజలకు విశేష సేవలు అందించారని మంత్రి కొనియాడారు. రాజకీయాల్లో నైతిక విలువలు పాటిస్తూ డేవిడ్ రాజు ఏ పదవిలో ఉన్నా ప్రతిక్షణం ప్రజాసేవకు పాటుపడ్డారన్నారు. డేవిడ్ రాజు ఆత్మకు శాంతి చేకూరాలని కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలియజేశారు. నివాళులు అర్పించిన వారిలో టిడిపి నాయకులు జి.రాజ్ విమల్, పసుమర్తి హగ్గయ్యరాజ్, పెద్దిపోగు కోటేశ్వరరావు తదితరులు ఉన్నారు.

డేవిడ్ రాజు మృతికి మాగుంట సంతాపం
మాజీ ఎమ్మెల్యే పాలపర్తి డేవిడ్‌రాజు మృతికి ఒంగోలు పార్లమెంట్ సభ్యులు మాగుంట శ్రీనివాసులు రెడ్డి సంతాపం తెలియజేశారు. జిల్లా పరిషత్ మాజీ చైర్మన్, మాజీ ఎమ్మెల్యే పాలపర్తి డేవిడ్ రాజు మరణ వార్త తనకు దిగ్భ్రాంతి కలిగించిందన్నారు. పాలపర్తి డేవిడ్ రాజు తెలుగుదేశం, వైసిపి తరపున శాసనసభ్యులుగా , జిల్లా పరిషత్ చైర్మన్‌గా అనేక పదవులు నిర్వహించి ప్రకాశం జిల్లా ప్రజలకు ముఖ్యంగా దళితుల అభ్యున్నతికి ఎనలేని కషిచేసి ప్రజా నేతగా మంచి గుర్తింపు పొందారన్నారు. మంచితనానికి – మానవత్వానికి ఆయన నిలువెత్తు నిదర్శనమన్నారు. ఆయన లేని లోటు జిల్లాలోని దళితులకు తీరని లోటన్నారు. ఆయన ఆత్మకు శాంతి కలగాలని, కుటుం బానికి ప్రఘాడ సానుభూతి తెలియజేశారు.

సిపిఎం నేతల నివాళి
మాజీ ఎమ్మెల్యే, జడ్పీ మాజీ చైర్ పర్సన్ పాలపర్తి డేవిడ్‌రాజు మతికి సిపిఎం ప్రకాశం జిల్లా కమిటీ సంతాపాన్ని ప్రకటించింది. ఒంగోలు క్లోపేట రెండవ లైన్‌లోని డేవిడ్‌రాజు నివాసంలో ఆయన పార్థివ దేహానికి సిపిఎం జిల్లా కార్యదర్శి సయ్యద్ హనీఫ్, జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు జివి.కొండారెడ్డి, కంకణాల ఆంజనేయులు, చీకటి శ్రీనివాసులు. ఏ.సువర్ణరాజు పూలమాల వేసి నివాళు లర్పించారు. కుటుంబ సభ్యులను పరామర్శించారు.

వాగును తలపిస్తున్న రహదారులు


రహదారిపై నిలిచిన మురుగునీరు

ప్రజాశక్తి-యర్రగొండపాలెం
మండల కేంద్రమైన యర్రగొండపాలెంలో పారిశుధ్య నిర్వహణ అస్తవ్యస్థంగా తయారైంది. డ్రైనేజీ వ్యవస్థ సరిగా లేకపోవడంతో వర్షపు నీరు రోడ్లపై నిలుస్తోంది. వస్తాద్ వారి వీధి, వేగినాటి కోటయ్య బజార్‌లో వర్షపు నీరు రోడ్లపై నిల్వఉంది. దీంతో ప్రజలు అవస్థలు పడుతున్నారు. పరిసరాలు దుర్గంధ భరితంగా మారుతున్నాయని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఎక్కడ రోగాల బారిన పడాల్సి వస్తుందోనని ఆందోళన చెందుతున్నారు. రాత్రి సమయంలో దోమలు స్వైర విహారం చేస్తున్నాయి. అసలే వర్షాకాలం సీజన్ ప్రారంభం కావడంతో సీజనల్ వ్యాధుల ప్రభావం పొంచి ఉంది. ప్రజలు దోమల బెడదతో మరింత కష్టాలను ఎదుర్కొంటున్నారు. మురుగు నీరు వెళ్లేందుకు కొన్ని చోట్ల కాలువలు ఉన్నా చెత్తచెదారంతో పేరుకు పోయి నిరుపయోగంగా మారాయి. మురుగు కాలువల పూడిక తీయించి నీరు సక్రమంగా పారేలా చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

వెలుగు ఉద్యోగుల బదిలీల్లో..

పశ్చిమ ప్రాంతానికి న్యాయం జరిగేనా..?


వెలుగు కార్యాలయం

ప్రజాశక్తి-యర్రగొండపాలెం
యర్రగొండపాలెం, పుల్లలచెరువు, త్రిపురాంతకం, పెద్దదోర్నాల, పెద్దారవీడు మండలాల్లో వెలుగు పథకం ఎపిఎంలు, సిసిల నియామకాల్లో మొదటి నుంచి ఈ ప్రాంతానికి జిల్లా అధికారులు వివక్షత చూపిస్తున్నారు. ఈ ప్రాంతంలో ఉన్న సిసిలు, ఎపిఎం ఖాళీ పోస్టులను భర్తీ చేయకుండా జిల్లాకు దగ్గర ప్రాంతాలైన మైదాన ప్రాంతాలలోనే ఎక్కువ సిబ్బందిని బదిలీ చేస్తూ జిల్లాకు దూరంగా ఉన్న పశ్చిమ ప్రాంతానికి అన్యాయం చేస్తున్నారన్న ఆరోపణలు బలంగా ఉన్నాయి. అందువలనే పశ్చిమ ప్రాంతంలో డిఆర్‌డిఎ వెలుగు పథకాల ప్రొగ్రెస్ రిపోర్టులు వెనుకబడి పోతున్నాయి. జిల్లా స్థాయి రివ్యూ మీటింగ్‌లలోనూ, టెలి కాన్ఫరెన్స్‌లలోనూ పశ్చిమ ప్రాంతంలో ఉన్న సిబ్బంది కొరతతో ప్రొగ్రెస్‌లో జిల్లాకు దగ్గర ఉన్న ప్రాంతాలతో పోటీ పడలేకపోతున్నారు. ఈ ప్రాంతంలో స్పెషల్ ప్రాజెక్టుగా (ఐటిడిఎ) కింద పుల్లలచెరువు, దోర్నాల, యర్రగొండపాలెం మండలాలున్నాయి. ఒక్కో మండలానికి ఒక్కో సిసి ఉండాలి. అయితే దోర్నాల మండలానికి మాత్రమే సిసిని నియమించారు. ఐదు సంవత్సరాల నుంచి పుల్లలచెరువు, యర్రగొండపాలెం మండలాలకు సిసిలు లేరు. అంతేకాకుండా గత ఐదు సంవత్సరాల నుంచి దోర్నాల, యర్రగొండపాలెం, పుల్లలచెరువు మండలాలకు ఎపిఎం (చెంచు) ఉండాల్సి ఉన్నప్పటికీ ఇప్పటి వరకు నియమించలేదు. సిబ్బంది కొరత కారణంగా చెంచులకు అందాల్సిన పథకాలు అందటం లేదు. వారు అభివృద్ధికి దూరమైపోతున్నారు. పుల్లలచెరువు మండలానికి ఎఫ్‌పిఒ సిసి ఉండాలి. కానీ ఐదు సంవత్సరాల నుంచి ఆ పోస్టు ఖాళీగా ఉంది. జిల్లా అధికారులు పట్టించుకోకుండా ఉన్నందున రైతు మిత్ర గ్రూపులకు సహాయం అందకుండా పోయింది. ఈసారైనా ప్రభుత్వ అధికారులు, ప్రజా ప్రతినిధులు ఈ ప్రాంతంపై దృష్టి పెట్టి న్యాయం చేయాల్సిన అవసరం ఎంతైనా ఉంది. దీనికి తోడు 2022-23 సంవత్సరంలో మహిళా శక్తి ఆటోలు ఒక్కొక్కరికి ఒకటి చొప్పున టార్గెట్ ఇచ్చారు. జిల్లాలో 38 మండలాలకు 38 ఆటోలు ఎస్సీ, ఎస్టీ లబ్ధిదారులకు ఇప్పించాల్సిన బాధ్యత ఉంది.గత ఆర్థిక సంవత్సరం 12 ఆటోలు మాత్రమే ఇచ్చారు. జిల్లా గ్రామీణాభివృద్ధి శాఖలో ఒకే పోస్టులో 20 సంవత్సరాల నుంచి పని చేసే వ్యక్తులను కొనసాగిస్తున్నారు. అంతేకాకుండా జిల్లాకు దగ్గర ఉన్న సిబ్బందిని సంవత్సరాల తరబడి జిల్లా కేంద్రంలో అవకాశం కల్పిస్తున్నారు. మిగతా వారిపై వివక్షత చూపుతున్నారు. ఈ విషయంలో ఉన్నతాధికారులు ప్రత్యేక శ్రద్ధ తీసుకొని పశ్చిమ ప్రాంతానికి బదిలీల్లో న్యాయం చేయాలని కోరుతున్నారు.